పక్కా తెలుగు

ప్రభాత కిరణమ్

సత్యానికి వారధి

PRGI REGD No.: TGTEL/26/A4986

5 DOTS NETWORK

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 004 | ఆదివారం | 28-06-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 004 | Sunday | 28-06-2025 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri

సర్వజనులకు శ్రీరామరక్ష అన్నది హిందువుల నానుడి. కానీ స్వయానా ఆ శ్రీరాముడి సొమ్ముకు ఎవరు రక్ష... రక్షకులే భక్షకులవడంతో.. హిందూ సమాజం తలదించుకునే పరిస్థితి ఉత్పన్నమైందా? రామాలయంలో రాబందుల్లా దోచుకుంటున్న తీరు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోందా? కంచే చేను మేసిన చందంగా.. అయోధ్య రామాలయ ట్రస్టీలు.. ట్రస్ట్‌ను కోల్పోయారు. ధర్మకర్తల మండలి తీరును చూస్తూ ఉంటే.. అయోధ్యలో అధర్మం తాండవిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయ్. ఎంతో భక్తితో కోట్లాది రామభక్తులు సమర్పించిన విరాళాలకు లెక్కా పద్దూ లేకుండా పోయింది.. ప్రతి రూపాయికి లెక్క చెప్పాల్సిన రామాలయ ధర్మకర్తలు దొంగలుపడ్డ ఆరు నెలల తర్వాత, మేలుకొని... హడావుడి చేస్తున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా అసలు దొంగల ఆచూకీ గుర్తించలేక.. సిట్ విచారణ పేరుతో ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం ఊకదంపుడు వ్యవహారం చేస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయ్. సీతను అపహరించిన రావణాసురుడి ఆచూకీని గుర్తించిన విధంగానే... సీసీ కెమెరాల కళ్లుగప్పిన సీక్రెట్ దొంగలు... ఇంద్రజిత్తుల్లా తప్పించుకు తిరగడంతో వారి ఆచూకీ కూడా అయోధ్యరాముడే గుర్తించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. అయోధ్యలో రామాలయ నిర్మాణంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేసిన హిందువులంతా ఈ దోపిడీ పర్వాన్ని చూసి... గుండెలు బాదుకుంటున్నారు. రాముడి పేరుతో రాజకీయం చేయడం మాని.. జరిగిన దోపిడి పర్వానికి ముగింపు పలికే విధంగా అసలు దొంగలను గుర్తించాల్సిన గురుతర బాధ్యత యోగీ సర్కార్‌తోపాటు, మోదీ సర్కారుపై ఉంది.

# రామాలయంలో రాబందులు

» అయోధ్యలో ఇంద్ర"జిత్తులు"..

» సిట్ కళ్లు కప్పేందుకు కొత్త ఎత్తులు




వివరాలు 7లో..

## రామమందిర విరాళాల వివాదం

- ట్రస్ట్‌లో రాజీనామాల కలకలం
- ముదురుతోన్న విరాళాల వివాదం

పాత్రధారులెవరు?
సూత్రధారులెవరు... తేలాల్సిందే
భక్తుల మనోభావాలతో ఆటలా?
విరాళాల వ్యవహారంలో పెద్దలెవరు?
ప్రియాంక గాంధీ ఘాటు ప్రశ్నలు

## సిట్ విచారణతో వెలుగులోకి సంచలన ఆరోపణలు

దర్యాప్తులో మలుపు.. వివాదం ఎలా బయటకొచ్చింది?



## మాట రాని మౌనమిది

- లడ్డు కల్తీపై రాద్ధాంతం.. హుండీ చోరీపై వేదాంతం..
- బాబు, పవన్‌లపై ఆర్కే ధ్వజం

సీపీఐ సీనియర్ నేత రామకృష్ణ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని నెలల తరబడి మాట్లాడిన ఇద్దరు నేతలు, ఇప్పుడు అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఒకే దేశంలో భక్తుల విశ్వాసానికి సంబంధించిన రెండు ఘటనలపై వేర్వేరు ప్రమాణాలు ఎందుకని నిలదీశారు. (వివరాలు 7లో..)




## ముహూర్తం రెడీ.. వారం మొత్తం హడావుడి

దాదాపు నెల రోజులుగా శుభకార్యాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. అధిక జ్యేష్ఠమాసం ముగియడంతో నిజ జ్యేష్ఠమాసంలో వరుసగా బలమైన ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. జూన్ 27 నుంచి జూలై 9 వరకు ఉన్న శుభదినాల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది వివాహాలు, గృహప్రవేశాలు, కొత్త వ్యాపారాల ప్రారంభాలు జరగనున్నాయి. దీంతో కల్యాణ మండపాలు, కేటరింగ్ సంస్థలు, పూల వ్యాపారులు, బంగారం దుకాణాలు, వస్త్ర షోరూమ్‌లు, ఫొటోగ్రాఫర్లు, పురోహితులు సహా అనుబంధ రంగాలన్నీ మళ్లీ కళకళలాడుతున్నాయి. పెళ్లి ఏర్పాట్ల కోసం కుటుంబాలు ఇప్పటికే షాపింగ్ ప్రారంభించగా, బంగారం దుకాణాల్లో ఆర్డర్లు పెరుగుతున్నాయి. నెల రోజులుగా పనులు లేక ఇబ్బంది పడిన వేలాది మంది కార్మికులకు కూడా ఈ ముహూర్తాలు ఉపాధి కల్పించనున్నాయి. ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఈ శుభవేళలు కొత్త ఊపును తీసుకురానున్నాయని వ్యాపార వర్గాలు, జ్యోతిష్య పండితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




## సంక్షేమం ఒక్కటే కాదు.. అభివృద్ధే రాష్ట్ర భవిష్యత్తు

### బటన్ నొక్కిన వైసీపీ పరిస్థితి ఏమైందో చూశాం

### కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదన్న పవన్

సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా సమానంగా ఉండాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజంగా అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందాలని చెప్పారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే పాలన సాగించడం సరైన విధానం కాదన్నారు. రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, తాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతులు కూడా ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు. (వివరాలు 2లో..)

# నాలుగు జిల్లాల భవిష్యత్ మార్చే వెలిగొండ

- రైతుల త్యాగం మరువలేం: చంద్రబాబు
- అభివృద్ధి... నిర్వాసితులకు భరోసా: సీఎం



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు. అనంతరం దోర్నాల మండలం గంటావానిపల్లిలో ప్రాజెక్టు నిర్వాసితులు, లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వెలిగొండ ప్రాజెక్టు నాలుగు జిల్లాల భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగం రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువరని అన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. పరిహారం చెల్లింపులు ప్రారంభం వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు తొలి విడతగా రూ.300 కోట్లు విడుదల చేస్తున్నట్లు చంద్రబాబు ప్రకటించారు. మొత్తం 3,351 కుటుంబాల ఖాతాల్లో ఈ నిధులు జమ చేస్తున్నామని తెలిపారు. పునరావాసం కోసం ఇప్పటికే రూ.900 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. నిర్వాసితుల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇడుపూరు, గోగులదిన్నె, తోకపల్లి పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. (2లో..)

## 30 ఏళ్ల కల సాకారం

- రైతుల కళ్లలో ఆనందం
- వెలిగొండపై ఆశల వెలుగు
- రైతులతో చంద్రబాబు భావోద్వేగం

## సంజీవని గేమ్‌ఛేంజర్

- ఇకపై ఏపీలో ఆరోగ్య విప్లవం
- మార్కాపురంలో సీఎం ప్రకటన
- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు




## సేఫ్ జోన్ నినాదం.. పొంచి ఉన్న ప్రమాదం

- తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న భూకంపం..
- మానవ తప్పిదాలతో తీరని శాపం
- తెలుగు రాష్ట్రాలు ఎంత భద్రం?
- ప్రపంచాన్ని భయపెడుతున్న భూకంపాలు

భూకంపం అంటే హిమాలయాలు, జపాన్, నేపాల్ మాత్రమే గుర్తొచ్చే రోజులు మారిపోయాయి. ఇటీవల తెలంగాణలోని ములుగు కేంద్రంగా నమోదైన భూకంపం, హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో అనిపించిన ప్రకంపనలు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆందోళన పెంచాయి. ఒకప్పుడు భూకంపాల ప్రభావం ఉండదని భావించిన హైదరాబాద్‌లో కూడా అప్పుడప్పుడు భూమి కంపించడం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారీ ఎత్తున నిర్మాణాలు, ఆకాశహర్మ్యాలు, విస్తరిస్తున్న నగరాలు భూకంపాలను తట్టుకునే స్థితిలో ఉన్నాయా అనే చర్చ మొదలైంది. మరోవైపు గోదావరి రిఫ్ట్ జోన్, కృష్ణా-గోదావరి బేసిన్, దక్కన్ పీఠభూమిలోని భౌగోళిక మార్పులు శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలు అత్యంత ప్రమాదకర భూకంప మండలాల్లో లేకపోయినా, పూర్తిగా భద్రమని చెప్పే పరిస్థితి లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భూకంపాల నేపథ్యంలో హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎంతవరకు సురక్షితం? భవిష్యత్తులో ఎలాంటి ముప్పు ఉండొచ్చు? ప్రజలు, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? అనే అంశాలపై ఇప్పుడు చర్చ అవసరమైంది.

# అమరావతిలో ఉద్రిక్తత

- అడ్డుకున్న రాజధాని రైతులు
- వైసీపీ నేతల పర్యటనతో అలజడి

అమరావతి రాజధాని ప్రాంతంలో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పెనుమాక ప్రాంతంలో పర్యటించేందుకు వచ్చిన వైసీపీ నేతల బృందాన్ని ఉండవల్లి వద్ద రాజధాని రైతులు అడ్డుకున్నారు. వాహనాలు ముందుకు వెళ్లకుండా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. నల్ల బ్యాడ్జీలు ధరించిన రైతులు వైసీపీ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాజధానిపై గతంలో తీసుకున్న వైఖరిని ప్రస్తావిస్తూ వైసీపీ నేతలకు అమరావతిలో పర్యటించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. (వివరాలు 2,3 లో..)

## ప్రభుత్వమా? గూండాల రాజ్యమా?

- అమరావతిలో దాడులపై ఫైర్
- నేతలను దాడులతో భయపెడతారా?
- కూటమి సర్కారుపై జగన్ విమర్శలు



## అమరావతిలో రౌడీయిజం యత్నమా?

వైసీపీ నేతలపై హోంమంత్రి అనిత విమర్శలు

## అమరావతిలో అలజడి కుట్ర?

వైసీపీపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం



## తిరుమలలో పోటెత్తిన భక్తజనం

దర్శనానికి లక్షన్నర మంది నిరీక్షణ

వారాంతపు సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. (వివరాలు 2లో..)

## గ్రీన్ సిగ్నల్

- విమానాశ్రయాల్లో 24 గంటల బార్లు
- తిరుపతికి మాత్రం మినహాయింపు
- కొత్త విధానానికి ప్రభుత్వం ఆమోదం

రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో బార్ లైసెన్స్‌లకు అనుమతి ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి విమానాశ్రయం మినహా మిగిలిన అన్ని ఎయిర్‌పోర్టుల్లో బార్ల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కొత్త మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసిన తర్వాత ఈ విధానాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది. (వివరాలు 2లో..)





## ఉపాధి పథకంపై అభ్యంతరాలు

- బీజేపీ పాలిత రాష్ట్రాల నుంచి ప్రశ్నలు
- కొత్త పథకంపై పెరుగుతున్న సందేహాలు
- నిధుల భారం... వేతనాల పెంపునకు డిమాండ్

జూలై 1 నుంచి అమల్లోకి రానున్న వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్... గ్రామీణ్ పథకంపై పలు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ముఖ్యంగా బీజేపీ పాలిత బిహార్, మధ్యప్రదేశ్‌తో పాటు జార్ఖండ్ కూడా కొత్త నిధుల భాగస్వామ్య విధానంపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఇప్పటి వరకు అమల్లో ఉన్న ఉపాధి హామీ చట్టంతో పోలిస్తే రాష్ట్రాలపై ఆర్థిక భారం భారీగా పెరుగుతుందని పేర్కొన్నాయి. (వివరాలు 2లో..)

## నేడు పల్స్ పోలియో..

» 49.2 లక్షల చిన్నారులకు టీకాలు
» మూడు రోజులు టీకా కార్యక్రమం
» పోలియో రహిత ఏపీ లక్ష్యం

ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 28 నుంచి మూడు రోజుల పాటు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నారు. ఐదేళ్లలోపు 49.2 లక్షల మంది చిన్నారులకు బైవేలెంట్ ఓరల్ పోలియో వ్యాక్సిన్ చుక్కలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. జాతీయ రోగనిరోధక దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్నారు. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా అన్ని జిల్లాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. (వివరాలు 2లో..)



# అమరావతిలో ఉద్రిక్తత

(మొదటి పేజీ తరువాయి..)

వైసీపీ నేతలు తమ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధానికి భూములు ఇవ్వమని ఎదురు తిరిగిన గ్రామాల్లో వైసీపీ లీగల్ టీమ్ పర్యటించింది. ఏ రకంగా మద్దతు ఇస్తామో వివరించి ఆ టీమ్ సభ్యులు వచ్చారు. ఇదే సందర్భంలో రాజకీయంగా అండగా వుంటామని, అలాగే వారి ఇబ్బందుల్ని ప్రత్యక్షంగా తెలుసుకోడానికి ఇవాళ ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, అరుణ్, మాజీ మంత్రులు అంబటి రాంబాబు, పేర్ని నాని తదితరులు వెళ్లారు.



### ఇరు వర్గాల మధ్య తోపులాట

ఇదే సమయంలో ఉండవల్లి సెంటర్ వద్ద వైసీపీ నేతలపై టీడీపీ సానుభూతిపరులు ఒక్కసారిగా రాళ్లు, కర్రలు, కోడిగుడ్లతో దాడికి తెగబడ్డారు. గో బ్యాక్ వైసీపీ అంటూ నల్లబ్యాడ్జీలతో టీడీపీ అనుకూలురు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకుల వాహనాలను అడ్డుకున్నారు. ఆందోళన కారుల రాళ్ల దాడిలో పోలీస్ తలకు తీవ్రగాయమైంది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన అతన్ని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వైసీపీ నేతలు ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకోవడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. కొద్దిసేపటికే పరస్పరం రాళ్లు విసురుకున్న ఘటన కూడా చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒక కానిస్టేబుల్ గాయపడినట్లు సమాచారం. ఆయనను వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

### పోలీసుల జోక్యంతో అదుపు

ఘటన తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు వెంటనే రంగప్రవేశం చేశారు. ఇరు వర్గాలను చెరో వైపునకు పంపించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మరింత ఉద్రిక్తత నెలకొనకుండా వైసీపీ నేతలను అక్కడి నుంచి వెనక్కి పంపించారు. అమరావతి ప్రాంతంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భద్రతను కట్టుదిట్టం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై వైసీపీ శ్రేణులే కోడిగుడ్ల తో దాడి చేశాయని రైతులు ఆరోపించారు. రాజధాని ప్రాంతంలో విభేదాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. అమరావతి అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రైతుల అభిప్రాయాలను పక్కనపెట్టి ఎలాంటి రాజకీయ కార్యక్రమాలు నిర్వహించరాదని పేర్కొన్నారు.

ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రాళ్ల దాడులు, తోపులాటకు కారణమైన పరిస్థితులపై ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం పరిస్థితి అదుపులో ఉన్నప్పటికీ అమరావతి ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం కొనసాగుతోంది. ఈ ఘటన రాజకీయంగా కూడా తీవ్ర చర్చకు దారి తీసింది.

# నాలుగు జిల్లాల భవిష్యత్ మార్చే వెలిగొండ

(మొదటి పేజీ తరువాయి..)

### సాగునీరు, తాగునీటితో మార్పు

వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని సీఎం తెలిపారు. 23 లక్షల మందికి తాగునీటి సౌకర్యం కల్పించే లక్ష్యంతో పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. 43.5 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. సుంకేసుల, గొట్టిపడియ డ్యామ్‌ల అభివృద్ధికి పరిపాలనా అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. 2027 నాటికి ప్రాజెక్టు మిగిలిన పనులన్నీ పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

### గత ప్రభుత్వంపై విమర్శలు

గత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే ప్రారంభోత్సవం చేసిందని చంద్రబాబు విమర్శించారు. టన్నెల్ 2లో యంత్రం చిక్కుకుపోయినా సమస్య పరిష్కరించకుండా ప్రారంభించారని ఆరోపించారు. పదేళ్ల ముందే ప్రాజెక్టు పూర్తయి ఉంటే రైతుల జీవితాలు మారిపోయేవని అన్నారు. వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టు పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు.




### మార్కాపురం అభివృద్ధిపై హామీ

మార్కాపురాన్ని హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని సీఎం ప్రకటించారు. హార్టికల్చర్ రంగ అభివృద్ధికి లక్ష కోట్ల రూపాయల ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని చెప్పారు. రామాయపట్నం పోర్టు, విమానాశ్రయం, మెరుగైన రోడ్డు, రైల్వే అనుసంధానంతో మార్కాపురం అభివృద్ధి వేగవంతం అవుతుందని వివరించారు. రైతుల ఆదాయం పెంచేందుకు ఎఫ్‌పీఓలను బలోపేతం చేస్తామని చెప్పారు.

### రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

ప్రాజెక్టుల కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎలాంటి నష్టం జరగనివ్వమని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి పూర్తి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు. పోలవరం, వెలిగొండ వంటి సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో నదుల అనుసంధానం ద్వారా మరింత సాగునీరు అందించే ప్రణాళికలు అమలు చేస్తామని వెల్లడించారు. అభివృద్ధినే ప్రధాన అజెండాగా తీసుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు.

# గ్రీన్ సిగ్నల్

- తిరుపతికి మాత్రం మినహాయింపు
- కొత్త విధానానికి ఆమోదం

రాష్ట్రంలోని విమానాశ్రయాల్లో బార్ లైసెన్స్‌లకు అనుమతి ఇస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. తిరుపతి విమానాశ్రయం మినహా మిగిలిన అన్ని ఎయిర్‌పోర్టుల్లో బార్ల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కొత్త మార్గదర్శకాలతో ఉత్తర్వులు జారీ చేసింది. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న విధానాలను అధ్యయనం చేసిన తర్వాత ఈ విధానాన్ని రూపొందించినట్లు ప్రభుత్వం తెలిపింది.

### 24 గంటల నిర్వహణకు అనుమతి

ఎయిర్‌పోర్టులో బార్ లైసెన్స్ పొందాలంటే సంబంధిత విమానాశ్రయ ఆపరేటర్ సిఫారసు తప్పనిసరిగా ఉండాలి. దరఖాస్తు చేసుకునే వారు రూ.5 లక్షల నాన్ రిఫండబుల్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో లైసెన్స్ ద్వారా గరిష్టంగా మూడు సర్వింగ్ పాయింట్లు ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారు. అన్ని నిబంధనలు పాటించిన తర్వాతే అనుమతి మంజూరు చేస్తారు. విమానాశ్రయాల్లో ఏర్పాటు చేసే బార్లు 24 గంటల పాటు పనిచేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. అయితే విమానాశ్రయ కార్యకలాపాలు, భద్రతా నిబంధనలకు పూర్తిగా లోబడి మాత్రమే సేవలు అందించాల్సి ఉంటుంది. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

### తిరుపతికి ప్రత్యేక మినహాయింపు

ఏటా 20 లక్షలకు పైగా ప్రయాణికులు వచ్చే విమానాశ్రయాలకు వార్షిక రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ రూ.25 లక్షలుగా నిర్ణయించారు. 20 లక్షలలోపు ప్రయాణికుల రద్దీ ఉన్న విమానాశ్రయాలకు రూ.15 లక్షల వార్షిక



పన్ను విధించనున్నారు. ఈ మొత్తాన్ని ఒకేసారి లేదా ఆరు సమాన వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు కల్పించారు. రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాలకు ఈ విధానం వర్తించినప్పటికీ తిరుపతి విమానాశ్రయాన్ని మాత్రం ప్రభుత్వం మినహాయించింది. ఆధ్యాత్మిక ప్రాధాన్యం, తిరుమల క్షేత్ర ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో తిరుపతి మినహా మిగిలిన విమానాశ్రయాల్లో కొత్త బార్ లైసెన్స్ విధానం అమల్లోకి రానుంది. ఈ నిర్ణయం రాష్ట్ర విమానాశ్రయాల్లో వాణిజ్య సేవల విస్తరణకు దోహదపడుతుందని అధికారులు భావిస్తున్నారు.

# సంక్షేమం ఒక్కటే కాదు.. అభివృద్ధే రాష్ట్ర భవిష్యత్తు

- బటన్ నొక్కిన వైసీపీ పరిస్థితి ఏమైందో చూశాం
- కులాల పేరుతో హాస్టళ్ల ఏర్పాటు సరికాదన్న పవన్

సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కూడా సమానంగా ఉండాలని జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన జనసేన నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజంగా అవసరమైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అందాలని చెప్పారు. అయితే సంక్షేమం పేరుతో మాత్రమే పాలన సాగించడం సరైన విధానం కాదన్నారు. రోడ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు, తాగునీటి సౌకర్యాలు, మౌలిక వసతులు కూడా ప్రజల జీవితాల్లో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.



### బటన్ నొక్కడం మాత్రమే పాలన కాదు

ప్రజల ఖాతాల్లో డబ్బులు జమ చేయడమే ప్రభుత్వ విజయానికి కొలమానం కాదని పవన్ అన్నారు. ప్రజలు ప్రయాణించే రహదారులు, ప్రభుత్వ ఆస్పత్రులు, విద్యా సంస్థలు కూడా మెరుగుపడాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం సంక్షేమానికే పరిమితమై అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని చెప్పారు. గ్రామస్థాయిలో అభివృద్ధి అంశాలపై పార్టీ నాయకులు ప్రజలతో చర్చించాలని సూచించారు.

### వైసీపీపై ఘాటు విమర్శలు

వైసీపీ నాయకులు విధానాల గురించి మాట్లాడకుండా వ్యక్తిగత విమర్శలు, దూషణలకే పరిమితమవుతున్నారని పవన్ కళ్యాణ్ ఆరోపించారు. 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన తర్వాత కూడా వారి తీరు మారలేదని వ్యాఖ్యానించారు. అసభ్య వ్యాఖ్యలు, వ్యక్తిత్వ హననం రాజకీయ సంస్కృతి కాదని స్పష్టం చేశారు. అలాంటి భాషను జనసేన ఎప్పటికీ ప్రోత్సహించదని వెల్లడించారు.

### కుల రాజకీయాలకు వ్యతిరేకం

కులాల పేరుతో సమాజాన్ని విభజించడం సరైన విధానం కాదని పవన్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ పేర్లతో వేర్వేరు హాస్టళ్లు ఏర్పాటు చేయడం తనకు ఇష్టం లేదని చెప్పారు. పిల్లలందరికీ ఒకే హాస్టల్ ఉండాలనేది తన అభిప్రాయమని వెల్లడించారు. కులం ఇంటి గడప దాటకూడదని, బయటకు వచ్చిన తర్వాత దేశం, సమాజం, మానవత్వం ముందుండాలని సూచించారు. కుల రాజకీయాలు తాత్కాలిక రాజకీయ ప్రయోజనం ఇవ్వొచ్చని, కానీ సామాజిక ఐక్యతకు అవి ఉపయోగపడవని అన్నారు.

### సామాజిక న్యాయంపై సందేశం

గాదె సాయికృష్ణ ఘటనను ప్రస్తావిస్తూ, నేరం చేసిన వ్యక్తికి కులాన్ని అంటగట్టడం సరైంది కాదని పవన్ పేర్కొన్నారు. తప్పు చేసినవాడు ఏ కులానికి చెందిన వారైనా చట్టం ముందు అందరూ సమానమేనని చెప్పారు. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరో న్యాయం ఉండకూడదన్నారు. ప్రజలను కులాల పేరుతో రెచ్చగొట్టడం రాష్ట్రానికి మంచిది కాదని హెచ్చరించారు.

### పార్టీ నిర్మాణంపై దిశానిర్దేశం

జనసేన నిర్మాణ సారథులు క్షేత్రస్థాయిలో నిజమైన కార్యకర్తలను గుర్తించాలని పవన్ సూచించారు. ఎన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న వారిని గుర్తించి తగిన బాధ్యతలు అప్పగిస్తామని చెప్పారు. కమిటీల ద్వారా సేకరించే సమాచారం పూర్తిగా పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### దేశం ముందు.. కులం తర్వాత

తన రాజకీయాల్లో దేశ ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఉంటుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధి, దేశాభివృద్ధి, సామాజిక ఐక్యతే తన లక్ష్యమని తెలిపారు. యువతలో సేవాభావం పెరగాలని, సమాజాన్ని విభజించే రాజకీయాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం, సామాజిక సమానత్వం కలిసే రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తాయని పేర్కొన్నారు.

# సంజీవని గేమ్‌ఛేంజర్

- ఇకపై ఏపీలో ఆరోగ్య విప్లవం
- మార్కాపురంలో సీఎం ప్రకటన
- ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా కిష్టంశెట్టిపల్లిలో సంజీవని డిజిటల్ నెర్వ్ సెంటర్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో సంజీవని పథకం రాష్ట్ర ఆరోగ్య రంగంలో గేమ్‌ఛేంజర్‌గా నిలుస్తుందని ప్రకటించారు. ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. ప్రజలకు వేగవంతమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రజల మద్దతు ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలమనే విశ్వాసం తనకు ఉందని పేర్కొన్నారు.




### ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు చేపడుతోందని చంద్రబాబు చెప్పారు. యోగా, ధ్యానం, సమతుల్య ఆహారం ప్రతి ఒక్కరి జీవితంలో భాగం కావాలని సూచించారు. పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. సంజీవని పథకం ద్వారా ప్రతి ఇంటికి ఆధునిక వైద్య సేవలు చేరువ అవుతాయని తెలిపారు. మన మిత్ర సేవల ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయాలని సీఎం సూచించారు. అధికంగా యూరియా వాడితే పంటలకు మార్కెట్‌లో ఆశించిన ధర లభించడం లేదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 20 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని వివరించారు. వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

### అభివృద్ధి, సంక్షేమంపై హామీ

మార్కాపురాన్ని ప్రత్యేక జిల్లాగా చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. ఎన్నికల్లో ప్రకటించిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం వంటి పథకాలు ప్రజల సంక్షేమం కోసమే అమలు చేస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరగడం తమ పాలనపై ప్రజల విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటి నుంచే నిర్ణయాలు తీసుకోవాలని చంద్రబాబు అన్నారు. యువత క్వాంటమ్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యం సాధించాలని సూచించారు. కొత్త ఆలోచనలతో ముందుకు వచ్చే యువతకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. భవిష్యత్‌లో పిల్లలే దేశానికి గొప్ప సంపద అని పేర్కొంటూ జనాభా సమతుల్యతపై కూడా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

### ప్రాజెక్టులు, రాజధానిపై వ్యాఖ్యలు

పోలవరం రాష్ట్రానికి జీవనాడి అని, వెలిగొండ ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలకు కీలక ప్రాజెక్టు అని సీఎం చెప్పారు. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిచేయడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. అమరావతిని దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా తీర్చిదిద్దుతామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు బలహీనపడ్డాయని విమర్శించారు. నదుల అనుసంధానం తన జీవిత లక్ష్యమని పేర్కొంటూ నీటి వనరులను సమర్థంగా వినియోగిస్తే రాష్ట్ర భవిష్యత్ మరింత బలపడుతుందని చెప్పారు. మహిళలను అవమానించే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేస్తూ ప్రజల గౌరవం కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని చంద్రబాబు అన్నారు.

# నేడు పల్స్ పోలియో..

(మొదటి పేజీ తరువాయి..)

ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 29,873 పోలియో బూత్‌లు ఏర్పాటు చేశారు. ఇంటింటికీ వెళ్లేందుకు 59,746 బృందాలను నియమించారు. అధిక ప్రమాద ప్రాంతాలు, వలస కార్మికుల నివాస ప్రాంతాల కోసం 1,757 మొబైల్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాలు, ప్రధాన ఆసుపత్రులు వంటి ప్రాంతాల్లో 1,144 ట్రాన్సిట్ బూత్‌లు ఏర్పాటు చేశారు. మొత్తం 1.31 లక్షలకుపైగా సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### మూడు రోజుల కార్యాచరణ

జూన్ 28న గ్రామాలు, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పోలియో బూత్‌ల వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి టీకా తీసుకోని చిన్నారులను గుర్తించి చుక్కలు వేయనున్నారు. ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

### డిజిటల్ పర్యవేక్షణ

పూర్తి కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ ప్రత్యేక డిజిటల్ పోర్టల్ ద్వారా పర్యవేక్షించనుంది. బూత్‌లు, మొబైల్ బృందాలు, ట్రాన్సిట్ కేంద్రాలు, ఇంటింటి సర్వే వివరాలను క్షేత్రస్థాయిలోనే నమోదు చేస్తారు. దీనివల్ల జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పురోగతిని పరిశీలించి లోపాలు ఉంటే వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.

### ప్రత్యేక దృష్టి ప్రమాద ప్రాంతాలపై

మురికివాడలు, సంచార జాతుల నివాసాలు, నిర్మాణ ప్రాంతాలు, ఇటుక బట్టీలు, వలస కార్మికుల కాలనీలు, పారిశ్రామిక ప్రాంతాలు వంటి అధిక ప్రమాద ప్రాంతాల్లో ప్రత్యేక బృందాలు పనిచేయనున్నాయి. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలను తప్పనిసరిగా సమీప పోలియో కేంద్రానికి తీసుకువచ్చి చుక్కలు వేయించాలని వైద్యారోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

# తిరుమలలో పోటెత్తిన భక్తజనం

- దర్శనానికి లక్షన్నర మంది నిరీక్షణ

వారాంతపు సెలవుల నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోంది. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

### క్యూలైన్లను పరిశీలించిన అదనపు ఈవో

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికార యంత్రాంగంతో కలిసి శనివారం క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జూన్ నెలలో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 80 వేల మందికిపైగా భక్తులకు దర్శనం కల్పిస్తున్నామని చెప్పారు. శనివారం లక్షన్నర మందికిపైగా భక్తులు దర్శనం కోసం వేచి ఉన్నారని వెల్లడించారు. ఆదివారం కూడా ఇదే స్థాయిలో రద్దీ కొనసాగే అవకాశముందని పేర్కొన్నారు.

### 18 గంటల నిరీక్షణ, సోమవారం, దర్శనాలు రద్దు

టోకెన్లు లేకుండా వచ్చిన భక్తులు శ్రీవారి సర్వదర్శనం కోసం సుమారు 18 గంటలు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణునివాసం కేంద్రాల వద్ద కూడా భక్తులు భారీగా బారులు తీరారు. సాధారణంగా మధ్యాహ్నం 12 గంటలకు జారీ చేసే సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లను పెరిగిన రద్దీ దృష్ట్యా రెండు గంటల ముందుగానే పంపిణీ చేశారు. పెరిగిన భక్తుల రద్దీ కారణంగా సోమవారం నిర్వహించే శ్రీవాణి కరెంట్ బుకింగ్ టికెట్ల దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. వీఐపీ సిఫార్సు లేఖల ఆధారంగా కల్పించే దర్శనాలు కూడా ఆ రోజు ఉండవని అధికారులు ప్రకటించారు. సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

### భక్తులకు విస్తృత సౌకర్యాలు

రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికీ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా అల్పాహారం, తాగునీరు, పాలు అందజేస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను కూడా మరింత కట్టుదిట్టం చేశారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ భక్తుల దర్శనం సాఫీగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాబోయే రోజుల్లో కూడా రద్దీ కొనసాగనున్న నేపథ్యంలో భక్తులు ముందస్తు ప్రణాళికతో తిరుమలకు రావాలని టీటీడీ సూచించింది.

# ఉపాధి పథకంపై అభ్యంతరాలు

(మొదటి పేజీ తరువాయి.)

కొత్త విధానం ప్రకారం మొత్తం వ్యయంలో 40 శాతం రాష్ట్రాలే భరించాల్సి ఉంటుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం వేతన వ్యయాన్ని పూర్తిగా భరించేది. ఇప్పుడు కొత్త విధానం అమల్లోకి వస్తే రాష్ట్రాలపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని ప్రభుత్వాలు అభిప్రాయపడ్డాయి. బిహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ ఈ నిబంధనను పునఃసమీక్షించాలని అధికారికంగా కోరాయి. ముఖ్యంగా జార్ఖండ్ ప్రభుత్వం ఈ వ్యయాన్ని భరించడం తమకు కష్టమని స్పష్టం చేసింది.

### వేతనాల పెంపునకు డిమాండ్

పథకంపై స్పందించిన 13 రాష్ట్రాల్లో ఐదు రాష్ట్రాలు గ్రామీణ కార్మికుల రోజువారీ వేతనాలను పెంచాలని కోరాయి. ప్రస్తుతం అమలవుతున్న వేతనాలు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా లేవని పేర్కొన్నాయి. బిహార్ ప్రభుత్వం రోజువారీ వేతనాన్ని రూ.255 నుంచి రూ.413కు పెంచాలని ప్రతిపాదించింది. జమ్మూ కశ్మీర్ రూ.272 నుంచి రూ.311కు పెంచాలని సూచించింది. జార్ఖండ్, పంజాబ్, ఉత్తరాఖండ్ కూడా వేతనాల పెంపునే కోరాయి.

### 60 రోజుల విరామంపైనా అభ్యంతరాలు

వ్యవసాయ సీజన్‌లో 60 రోజుల పని విరామం కల్పించే నిబంధనపై కూడా పలు రాష్ట్రాలు అసంతృప్తి వ్యక్తం చేశాయి. పంజాబ్, తెలంగాణ, కర్ణాటక సహా నాలుగు రాష్ట్రాలు ఈ నిబంధనను పునఃపరిశీలించాలని సూచించాయి. ఈ విరామం గ్రామీణ కార్మికుల ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాయి.

### బకాయిల చెల్లింపులపై ఆందోళన

దాదాపు అన్ని రాష్ట్రాలు మరో కీలక అంశాన్ని కూడా కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. వేతనాలు, మెటీరియల్ బిల్లుల చెల్లింపుల్లో తరచూ జాప్యం జరుగుతోందని పేర్కొన్నాయి. కొత్త పథకంలో అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరాయి. గ్రామీణ ఉపాధి పథకం సమర్థంగా అమలవ్వాలంటే నిధుల విడుదల, వేతనాల చెల్లింపులు సమయానికి జరగాలని రాష్ట్రాలు స్పష్టం చేశాయి. కొత్త విధానంపై రాష్ట్రాల అభ్యంతరాలు వ్యక్తమవడంతో కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# 30 ఏళ్ల కల సాకారం

- రైతుల కళ్లలో ఆనందం
- వెలిగొండపై ఆశల వెలుగు
- రైతులతో చంద్రబాబు భావోద్వేగం

మార్కాపురం జిల్లా పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోని రైతులు, నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సమావేశం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. మార్కాపురం, ఎర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు హాజరయ్యారు. పొలాల మధ్య జరిగిన ఈ సమావేశంలో రైతులు తమ సమస్యలు, ఆశలు ముఖ్యమంత్రితో పంచుకున్నారు.

### 30 ఏళ్ల కల నెరవేరిందన్న రైతులు

మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న వెలిగొండ ప్రాజెక్టు పూర్తి దశకు చేరుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందని రైతులు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది రైతులు భావోద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణకు ఇప్పుడు ఫలితం కనిపిస్తోందని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణంతో పాటు పునరావాస కార్యక్రమాలను కూడా ప్రభుత్వం వేగంగా అమలు చేస్తుండటం సంతోషంగా ఉందని నిర్వాసితులు తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలను సకాలంలో అందించే చర్యలు తీసుకుంటున్నందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. నిర్వాసిత కుటుంబాలకు అన్ని వసతులు కల్పించాలని కూడా ముఖ్యమంత్రిని కోరారు.

### ఉపాధి అవకాశాలపై విజ్ఞప్తి

వెలిగొండ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రైతులు ముఖ్యమంత్రిని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు విలువ పెరిగేలా పరిశ్రమలు వస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. రైతుల సూచనలను ప్రభుత్వం పరిశీలిస్తుందని సీఎం హామీ ఇచ్చినట్లు సమావేశంలో పాల్గొన్న వారు తెలిపారు.



# నో అనే ఒక్క మాట.. చంపేసింది

## పూణే హత్య కేసులో మౌనం పాత్ర

ఒక హత్య జరిగింది. ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కుట్ర కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఎవరు, శిక్ష ఏమిటి అనేది కోర్టు తేల్చాల్సిన విషయం. కానీ ఈ ఘటన సమాజం ముందు మరో పెద్ద ప్రశ్నను నిలబెట్టింది. చదువుకున్న యువత తమ జీవిత భాగస్వామిని గురించి నిజమైన నిర్ణయం తీసుకునే ధైర్యాన్ని ఎందుకు కోల్పోతోంది? "ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు" అని చెప్పే స్వేచ్ఛ ఎందుకు అంత కష్టంగా మారుతోంది?

### మాట చెప్పకపోతే మంట పెరుగుతుంది

మన సమాజంలో పెళ్లి ఇద్దరి జీవితాల కలయిక కంటే రెండు కుటుంబాల ప్రతిష్ఠగా మారింది. ఫంక్షన్ హాళ్లు బుక్ అవుతాయి. లక్షల రూపాయల ఖర్చులు మొదలవుతాయి. బంగారం కొంటారు. బంధువులకు సమాచారం వెళ్తుంది. చివరికి పెళ్లి కూతురు, పెళ్లి కొడుకు మనసు మాత్రం చివరి స్థానంలో నిలుస్తుంది. ఒక "నో" చెప్పడం కుటుంబానికి అవమానంగా కనిపిస్తుంది. అదే మాట చెప్పకుండా ఉండటం జీవితానికే ప్రమాదంగా మారుతోంది.

### ఎమోషన్స్.. డబ్బు.. రహస్య సంబంధాలు

ఇలాంటి ఘటనల వెనుక ఒక్క కారణం ఉండదు. భావోద్వేగ ఒత్తిడి ఉంటుంది. కుటుంబ గౌరవం పేరు మీద భయం ఉంటుంది. డబ్బు, ఆస్తి, సామాజిక హోదా కూడా ప్రభావం చూపుతాయి. కొన్నిసార్లు రహస్య ప్రేమ సంబంధాలు ఉంటాయి. మరికొన్ని సందర్భాల్లో శారీరక ఆకర్షణ నిర్ణయాలను మార్చేస్తుంది. ఈ అంశాలు కలిసినప్పుడు నిజం చెప్పే ధైర్యం తగ్గిపోతుంది. అబద్ధాలు మొదలవుతాయి. మోసాలు పెరుగుతాయి. చివరకు నేరాలకు దారి తీసే పరిస్థితులు ఏర్పడతాయి. అయితే ఈ అంశాలు ఏవీ హింసకు సమర్థన కావు. హత్యకు ఎలాంటి న్యాయం లేదు.

### వివాహం జీవితాంతం కొనసాగే భాగస్వామ్యం

పెళ్లి అంటే ఒకరోజు జరిగే వేడుక కాదు. జీవితాంతం కొనసాగే భావోద్వేగ, చట్టపర, ఆర్థిక భాగస్వామ్యం. ఇద్దరూ స్వచ్ఛందంగా అంగీకరించినప్పుడు మాత్రమే ఆ బంధం బలంగా నిలుస్తుంది. ఒత్తిడితో తీసుకున్న నిర్ణయాలు తర్వాత కుటుంబ కలహాలు, విడాకులు, మానసిక సమస్యలు, కొన్నిసార్లు నేరాలకు కూడా దారి తీసే ప్రమాదం ఉంది. అందుకే పెళ్లికి ముందు ఇద్దరూ ఒకరినొకరు బాగా అర్థం చేసుకునే అవకాశం ఉండాలి.

### తల్లిదండ్రులు ఆలోచించాల్సిన ప్రశ్న

ప్రతి తల్లిదండ్రి పెళ్లికి ముందు ఒక్కసారి తమ పిల్లలను ఒంటరిగా కూర్చోబెట్టి ఒక ప్రశ్న అడగాలి. "నువ్వు ఈ పెళ్లి వద్దు అని చెప్పినా మేము నిన్ను అదే ప్రేమతో అంగీకరిస్తామా?" అని. ఆ ప్రశ్నకు పిల్లలు భయపడకుండా సమాధానం చెప్పగలిగితేనే అది నిజమైన సమ్మతి. లేకపోతే అది కేవలం ఒప్పుకోవడం మాత్రమే.

### సమాజానికి ఈ ఘటన ఇచ్చే సందేశం

ఈ ఘటనను కేవలం ఒక క్రైమ్ స్టోరీగా చూడటం సరిపోదు. ఇది సమాజానికి హెచ్చరిక. మనం పిల్లలకు చదువు, ఉద్యోగం, సంపాదన నేర్పిస్తున్నాం. కానీ తమ జీవితంపై నిజాయితీగా నిర్ణయం తీసుకునే ధైర్యం నేర్పిస్తున్నామా? "వద్దు" అని చెప్పే హక్కును గౌరవిస్తున్నామా? వివాహానికి ముందు నేపథ్య పరిశీలన, పరస్పర అవగాహన, స్వేచ్ఛాయుత నిర్ణయం తప్పనిసరిగా మారాలి. ఒక నిజమైన "నో" తాత్కాలిక బాధను కలిగించవచ్చు. కానీ అబద్ధంతో సాగిన జీవితం ఎన్నో కుటుంబాలను శాశ్వత విషాదంలోకి నెట్టే ప్రమాదం ఉంది. అదే ఈ ఘటన మనకు ఇస్తున్న అతిపెద్ద సందేశం.

– మీలో ఒకడు

# పెళ్లి రద్దు కంటే హత్యే సులభమా?

- పోలీసులకు సంచలన వాంగ్మూలం
- దర్యాప్తులో వెలుగులోకి నిజాలు

పూణేలో రియల్ ఎస్టేట్ వ్యాపారి కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలు సియా గోయల్ పోలీసుల విచారణలో చేసినట్లు చెబుతున్న ఒప్పుకోలు ఈ కేసును మరింత సంచలనంగా మార్చాయి. నవంబరులో జరగాల్సిన పెళ్లిని రద్దు చేయడం కంటే కేతన్‌ను హత్య చేయడమే సులభంగా అనిపించిందని ఆమె చెప్పినట్లు దర్యాప్తు వర్గాల సమాచారం. కుటుంబ సభ్యుల మనోభావాలు దెబ్బ తినకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఆమె వెల్లడించినట్లు తెలుస్తోంది.

### ప్రేమ సంబంధమే కారణమా?

పోలీసుల కథనం ప్రకారం సియాకు చేతన్ చౌదరితో ప్రేమ సంబంధం ఉంది. కేతన్‌తో వివాహం చేసుకోవాలని ఆమెకు ఇష్టం లేకపోయినా కుటుంబ సభ్యులకు ఆ విషయం చెప్పలేకపోయిందని తెలుస్తోంది. ఈ కారణంగానే లోహగఢ్ కోట వద్ద ట్రెక్కింగ్‌కు వెళ్లిన సమయంలో ముందుగానే పథకం ప్రకారం కేతన్‌ను హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. జూన్ 18న జరిగిన ఈ ఘటనను తొలుత ప్రమాదంగా చూపించే ప్రయత్నం జరిగినట్లు విచారణలో బయటపడింది.

### ఆరు ప్రత్యేక బృందాలతో దర్యాప్తు

ఈ కేసు దర్యాప్తు కోసం పుణే పోలీసులు, లోణావాలా పోలీసులు కలిపి ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సియా తల్లిదండ్రులు పోలీసుల విచారణను ఎదుర్కొంటున్నారు. ఆమె సోదరుడు సాహిల్‌ను కూడా రెండోసారి ప్రశ్నిస్తున్నారు. కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పోలీసులు జాగ్రత్తగా పరిశీలిస్తున్నారు.

### కాల్ రికార్డుల్లో కీలక ఆధారాలు

దర్యాప్తులో కాల్ రికార్డులు కీలక ఆధారాలుగా మారాయి. ఈ ఏడాది జనవరి నుంచి సియా, చేతన్ మధ్య రెండు వేలకుపైగా ఫోన్ సంభాషణలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. మొత్తం 238 గంటలకు పైగా ఇద్దరూ మాట్లాడినట్లు కాల్ వివరాలు సూచిస్తున్నాయి. గత ఏడాది దీపావళి వేడుకలో ఉమ్మడి స్నేహితుడి ద్వారా ఇద్దరికీ పరిచయం ఏర్పడిందని పోలీసులు చెబుతున్నారు.

### డిలీట్ చేసిన డేటాపై దృష్టి

సియా, చేతన్ మొబైల్ ఫోన్ల నుంచి తొలగించిన సమాచారాన్ని తిరిగి సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కుట్ర జరిగిందని నిరూపించే డిజిటల్ ఆధారాల కోసం ఫోరెన్సిక్ నిపుణుల సహాయం తీసుకుంటున్నారు. మరోవైపు ఈ వివాహాన్ని కుదిర్చిన మధ్యవర్తులను కూడా పోలీసులు ప్రశ్నిస్తున్నారు. దర్యాప్తు పూర్తయిన తర్వాతే హత్య వెనుక పూర్తి వాస్తవాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

# పూణే కేసులో ట్విస్ట్

- నిశ్చితార్థం నుంచి హత్య వరకు
- మిట్టల్ కుటుంబం కేంద్రబిందువు
- పెళ్లి సంబంధం వెనుక కీలక పాత్ర

పుణేలో కేతన్ అగర్వాల్ హత్య కేసు దర్యాప్తులో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నిందితురాలు సియా గోయల్‌కు కేతన్‌తో పెళ్లి సంబంధం కుదరడంలో ఆమె బంధువులు నరేంద్ర మిట్టల్, రేణు మిట్టల్ కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా వారిని విచారించిన అధికారులు, సంబంధం కుదిరే సమయంలో తమకు ఎలాంటి అనుమానాలు రాలేదని వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.



### అసలు విషయం తెలియలేదన్న బంధువులు

సియా చిన్నప్పటి నుంచి తమకు తెలుసని, ఆమె ఇలాంటి పని చేస్తుందని ఎన్నడూ ఊహించలేదని మిట్టల్ దంపతులు పోలీసులకు తెలిపారు. సియా, కేతన్ ఇద్దరూ మంచి స్వభావం కలిగిన వారేనని భావించామని చెప్పారు. సియాకు చేతన్ చౌదరితో ప్రేమ సంబంధం ఉందనే విషయం తమతో పాటు కుటుంబంలోని ఇతరులకు కూడా తెలియదని వెల్లడించారు.

### జనవరిలో చర్చలు.. ఫిబ్రవరిలో నిశ్చితార్థం

పోలీసుల వివరాల ప్రకారం 2026 జనవరిలో రెండు కుటుంబాల మధ్య పెళ్లి చర్చలు ప్రారంభమయ్యాయి. ఫిబ్రవరిలో నిశ్చితార్థం జరిగింది. నవంబరులో ఘనంగా వివాహం జరపాలని నిర్ణయించారు. ఈ మొత్తం వ్యవహారంలో తమ పాత్ర రెండు కుటుంబాలను పరిచయం చేయడం వరకే పరిమితమైందని నరేంద్ర మిట్టల్ పేర్కొన్నారు.

### ప్రేమ సంబంధమే హత్యకు కారణమా?

పోలీసుల దర్యాప్తు ప్రకారం సియా గోయల్‌కు చేతన్ చౌదరితో ప్రేమ సంబంధం ఉంది. కేతన్ తమ బంధానికి అడ్డుగా మారాడని భావించి కుట్ర పన్నినట్లు అనుమానిస్తున్నారు. లోహగఢ్ కోట వద్ద ట్రెక్కింగ్ సమయంలో సియా ఇచ్చిన సంకేతంతో చేతన్ కేతన్‌ను సుమారు 400 అడుగుల లోయలోకి తోసేశాడని పోలీసులు చెబుతున్నారు. తొలుత ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం జరిగినా కుటుంబ సభ్యుల అనుమానాలతో అసలు విషయం బయటపడింది.

### కుటుంబాల వాదనలు భిన్నం

దర్యాప్తులో మరో ఆసక్తికర అంశం కూడా బయటపడింది. కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ మాట్లాడుతూ రేణు మిట్టల్ హామీ ఇవ్వడంతోనే ఈ సంబంధానికి అంగీకరించినట్లు తెలిపారు. మరోవైపు సియా తల్లిదండ్రులు తమ కుమార్తెకు చేతన్ గురించి ఎలాంటి పరిచయం లేదని చెబుతున్నారు. అయితే సియా తన కుటుంబాన్ని ఎదుర్కొనే కంటే కేతన్‌ను హత్య చేయడం సులభంగా అనిపించిందని పోలీసుల ఎదుట ఒప్పుకున్నట్లు సమాచారం. కేసులోని అన్ని కోణాలపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# డ్రైవర్లే యాజమానులు

- భారత్ ట్యాక్సీకి అమిత్ షా శ్రీకారం
- రెండేళ్లలో 500 నగరాలకు విస్తరణ
- గుజరాత్‌లో సేవల ప్రారంభం




కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్‌లో "భారత్ ట్యాక్సీ" సేవలను ప్రారంభించారు. కోఆపరేటివ్ విధానంలో రూపొందించిన ఈ సేవలో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండటం ప్రత్యేకత అని చెప్పారు. ప్రస్తుతం ప్రజల రోజువారీ జీవితంలో ట్యాక్సీ సేవలు అత్యవసరంగా మారాయని పేర్కొన్నారు. డ్రైవర్లకు న్యాయం చేసే ప్రత్యామ్నాయ వ్యవస్థగా భారత్ ట్యాక్సీ నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### 500 నగరాలకు విస్తరణ

రెండేళ్లలో దేశవ్యాప్తంగా 500 నగరాలకు భారత్ ట్యాక్సీ సేవలను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అమిత్ షా తెలిపారు. ఇప్పటికే ఏడు లక్షల మంది డ్రైవర్లు ఈ యాప్‌లో భాగస్వాములయ్యారని వెల్లడించారు. ఈ విధానం ద్వారా డ్రైవర్లకు ఆర్థిక భద్రత లభిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో మరింత మంది ఈ వ్యవస్థలో చేరుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

### ప్రైవేట్ యాప్‌లపై విమర్శలు

ప్రైవేట్ రైడ్ హైలింగ్ యాప్‌లపై అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. కార్పొరేట్ సంస్థలు లాభాల కోసం డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. డ్రైవర్లను కేవలం ఉద్యోగులుగా కాకుండా సారథులుగా చూడాలని అన్నారు. వినియోగదారులకు, డ్రైవర్లకు సమాన ప్రయోజనం కలిగించే విధానమే భారత్ ట్యాక్సీ ప్రత్యేకత అని వివరించారు.

### ధరలపై స్పష్టీకరణ

భారత్ ట్యాక్సీ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయన్న విమర్శలను అమిత్ షా ఖండించారు. పోటీ సంస్థలు ఉద్దేశపూర్వకంగా తమ ధరలను తగ్గించి మార్కెట్‌లో భారత్ ట్యాక్సీని బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. అయితే అలాంటి వ్యూహాలకు తాము భయపడబోమని స్పష్టం చేశారు. భారత్ ట్యాక్సీ దీర్ఘకాలం నిలబడి విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

### కోఆపరేటివ్ మోడల్‌పై విశ్వాసం

దేశంలో విజయవంతమైన పలు సహకార సంస్థలను ఉదాహరణగా పేర్కొన్న అమిత్ షా, అదే తరహాలో భారత్ ట్యాక్సీ కూడా ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సేవల విజయానికి డ్రైవర్లు, వినియోగదారుల సహకారమే కీలకమని చెప్పారు. దేశవ్యాప్తంగా న్యాయమైన, పారదర్శకమైన ట్యాక్సీ వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వెల్లడించారు.

# సినిమాకు మించిన స్టోరీ

- ముందు కత్తిపోట్లు
- ఆ తర్వాత కారు పేలుడు
- మంటల్లో సజీవ దహనం
- ఇలా కూడా జరుగుతాయా?

కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో శనివారం సంచలన ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి యువతిపై కత్తితో దాడి చేసిన కొద్దిసేపటికే వాహనం పేలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నాగేంద్ర అనే 30 ఏళ్ల వ్యక్తి సజీవ దహనమయ్యాడు. తీవ్రంగా గాయపడిన రమ్య ఉల్లాస్ అనే 23 ఏళ్ల యువతిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

### బెంగళూరు నుంచి ప్రారంభమైన ప్రయాణం

ప్రాథమిక సమాచారం ప్రకారం నాగేంద్ర బెంగళూరులో కారును బుక్ చేశాడు. అక్కడే రమ్య కూడా కారులో ఎక్కింది. ఇద్దరూ అంకోల వైపు ప్రయాణం ప్రారంభించారు. తుమకూరు సమీపానికి చేరుకున్న తర్వాత ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు డ్రైవర్ పోలీసులకు తెలిపాడు.

### కత్తిపోట్ల తర్వాత బయటకు దూకిన యువతి

వాగ్వాదం తీవ్రరూపం దాల్చడంతో నాగేంద్ర కత్తితో రమ్యపై దాడి చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. గాయపడినప్పటికీ రమ్య డ్రైవర్‌కు అతని వద్ద బాంబు ఉందని హెచ్చరించింది. వెంటనే కారు నుంచి బయటకు దూకింది. డ్రైవర్ ప్రవీణ్ కూడా వాహనాన్ని రోడ్డుపక్కన ఆపి బయటకు వచ్చాడు.

### పేలుడుతో మంటలు

యువతి బయటకు వచ్చిన కొద్దిసేపటికే కారు ఒక్కసారిగా పేలిపోయి మంటల్లో చిక్కుకుంది. కారులోనే ఉన్న నాగేంద్ర బయటకు రాలేక మంటల్లో కాలిపోయాడు. ఈ ఘటనలో డ్రైవర్ ప్రవీణ్ కూడా స్వల్ప గాయాలు పొందాడు. పేలుడు శబ్దంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

### ఫోరెన్సిక్ దర్యాప్తు కొనసాగుతోంది

నాగేంద్ర తన వెంట తీసుకువచ్చిన దేశీయ బాంబును పేల్చి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. పేలుడుకు అసలు కారణం ఏమిటి, ఎలాంటి పేలుడు పదార్థం ఉపయోగించారు అనే విషయాలను ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలిస్తున్నారు. తుమకూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. దాడి వెనుక ఉద్దేశం ఏమిటి, పేలుడు ఎలా జరిగింది అనే కోణాల్లో పోలీసులు సమగ్ర దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



# నాలుగు తరాల భూ వివాదం

- 69 ఏళ్ల వివాదానికి ముగింపు
- సేల్ డీడ్‌కు గ్రీన్ సిగ్నల్
- సుప్రీంకోర్టు కీలక తీర్పు



దాదాపు నాలుగు తరాలుగా కొనసాగుతున్న భూ వివాదానికి సుప్రీంకోర్టు ముగింపు పలికింది. 1957లో జరిగిన భూమి అమ్మకపు ఒప్పందం చట్టబద్ధమేనని స్పష్టం చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియా ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. దీంతో దశాబ్దాలుగా సాగుతున్న న్యాయపోరాటానికి తెరపడింది.

### 1957లో భూమి కొనుగోలు

ఈ కేసులో అప్పీలుదారుడు సరాఫత్ అలీ కుటుంబం 1957లో ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ ప్రాంతంలో కొంత భూమిని కొనుగోలు చేసింది. అప్పట్లో సరాఫత్ అలీ మైనర్ కావడంతో ఆయన పూర్వీకులే ఈ లావాదేవీ పూర్తి చేశారు. ఆ భూమి అప్పటి నుంచి వారి ఆధీనంలోనే ఉంది. అయితే భూమిని విక్రయించిన వారి నుంచి అభ్యంతరాలు రావడంతో మ్యూటేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. తర్వాత 1984లో అభ్యంతరాలు ఉపసంహరించుకోవడంతో మ్యూటేషన్ పూర్తయింది.

### వివాదం కోర్టుల వరకు

1991లో భూముల ఏకీకరణ ప్రక్రియ ప్రారంభమైన సమయంలో సరాఫత్ అలీ తన పేరును భూయజమానిగా నమోదు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. 1993లో కన్సాలిడేషన్ అధికారి ఆయన హక్కులను గుర్తించారు. తర్వాత కొందరు సహ హక్కుదారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో 1999లో అదే అధికారి సరాఫత్ కుటుంబానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. ఉత్తరప్రదేశ్ జమీందారీ చట్టం ప్రకారం 1957 నాటి సేల్ డీడ్ చెల్లదని పేర్కొన్నారు. అనంతరం హైకోర్టులో కూడా సరాఫత్ కుటుంబానికి అనుకూల తీర్పు రాలేదు.

### సాక్షి వివరాలపై స్పష్టత

ఈ కేసును పరిశీలించిన సుప్రీంకోర్టు సాక్షి వివరాల్లో చిన్నచిన్న లోపాలు ఉన్నాయనే కారణంతో సేల్ డీడ్‌ను చెల్లదని చెప్పడం సరికాదని స్పష్టం చేసింది. ఈ లావాదేవీ నకిలీ అని ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని కూడా ధర్మాసనం గుర్తుచేసింది. కేవలం సాంకేతిక కారణాలతో హక్కులను తిరస్కరించడం న్యాయసమ్మతం కాదని పేర్కొంది.
జమీందారీ 1981లో చేసిన సవరణలను 1957లో జరిగిన లావాదేవీకి వర్తింపజేయడం సరికాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అందువల్ల 1957 నాటి సేల్ డీడ్ పూర్తిగా చట్టబద్ధమని ప్రకటించింది. ఈ తీర్పుతో దాదాపు 69 ఏళ్లుగా కొనసాగిన భూ వివాదానికి తెరపడింది. భూ యాజమాన్యానికి సంబంధించిన పాత కేసుల విచారణలో ఈ తీర్పు కీలక మార్గదర్శకంగా నిలిచే అవకాశం ఉందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# అమరావతిలో రౌడీయిజం యత్నమా?

- వైసీపీ నేతలపై హోంమంత్రి అనిత విమర్శలు

అమరావతి ప్రాంతంలో వైసీపీ నేతల పర్యటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రంగా స్పందించారు. వైసీపీ నాయకులకు అమరావతిలో పర్యటించే నైతిక అర్హత లేదని వ్యాఖ్యానించారు. రైతులను పరామర్శించడానికి వెళ్లారా, లేక రాజధానిలో రౌడీయిజం చేయడానికి వెళ్లారా అని ప్రశ్నించారు. పెనుమాక ప్రాంతంలో ఉద్రిక్తతలు తలెత్తే అవకాశం ఉందని పోలీసులు ముందుగానే హెచ్చరించినప్పటికీ పర్యటన కొనసాగించారని విమర్శించారు.



### రైతులే అడ్డుకున్నారని వ్యాఖ్య

పెనుమాక ప్రాంతంలో అధిక శాతం మంది రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులేనని హోంమంత్రి తెలిపారు. వైసీపీ నేతలను అడ్డుకుంది టీడీపీ కార్యకర్తలు కాదని, రాజధాని రైతులేనని స్పష్టం చేశారు. రైతులే తప్పు చేసినట్లు వైసీపీ నాయకులు మాట్లాడటం సరికాదని అన్నారు. రైతుల మనోభావాలను గౌరవించాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉందని వ్యాఖ్యానించారు. వైసీపీ నేతల వెంట రౌడీషీటర్లు వచ్చారని హోంమంత్రి ఆరోపించారు. వారి వివరాలన్నీ పోలీసు శాఖ వద్ద ఉన్నాయని తెలిపారు. వైసీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదును కూడా చట్టపరంగా విచారిస్తామని స్పష్టం చేశారు. ఘటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు పరిశీలిస్తున్నారని వెల్లడించారు.

### అమరావతి అభివృద్ధిపై వ్యాఖ్యలు

అమరావతి ప్రజల కలల రాజధానిగా వేగంగా అభివృద్ధి చెందుతోందని అనిత అన్నారు. 2027 నాటికి రాజధాని నిర్మాణం పూర్తయ్యేలా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. గతంలో అమరావతిని రాజధానిగా అంగీకరించి, తర్వాత మూడు రాజధానుల ప్రతిపాదన తీసుకొచ్చిన వైసీపీ ఇప్పుడు మరోసారి రాజధాని పేరుతో రాజకీయాలు చేస్తోందని విమర్శించారు. అమరావతి పూర్తయితే వైసీపీకి రాజకీయంగా ఇబ్బందులు వస్తాయనే ఉద్దేశంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆరోపించారు. రాజధాని రైతులపై జరిగిన దాడి అంశాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని హోంమంత్రి వెల్లడించారు. జరిగిన ఘటనపై అధికారుల నుంచి పూర్తి వివరాలు తీసుకున్నట్లు చెప్పారు. గతంలో టీడీపీ కార్యాలయంపై దాడి చేసినవారే ఇప్పుడు రాజధాని రైతులపైకి వచ్చారని ఆరోపించారు. ఘటనకు సంబంధించిన దృశ్యాలు, ఆధారాలు పోలీసుల వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. చట్టం ప్రకారం పూర్తిస్థాయి విచారణ నిర్వహించి అవసరమైన చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత స్పష్టం చేశారు.

# అమరావతిలో అలజడి కుట్ర?

- వైసీపీపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం

అమరావతిలో అలజడి సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ఇటీవల వైసీపీ నేతల పర్యటన ప్రజలను రెచ్చగొట్టేలా సాగిందని విమర్శించారు. ఈ పరిణామాలను బట్టి మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు అమరావతిపై ఇంకా కక్ష ఉందని వ్యాఖ్యానించారు. రైతులపై దండయాత్ర చేసినట్లు వ్యవహరించడాన్ని రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే ప్రతి ఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు.

### మూడు రాజధానుల అంశంపై విమర్శలు

మూడు రాజధానుల పేరుతో భూములు త్యాగం చేసిన రైతులను రోడ్డుపైకి తెచ్చిందని నాదెండ్ల విమర్శించారు. అమరావతి రైతులు నిరసనలు తెలిపిన సమయంలో అప్పటి ప్రభుత్వం అప్రజాస్వామికంగా వ్యవహరించిందని ఆరోపించారు. మహిళా రైతులను కూడా అవమానించారని అన్నారు. జగన్‌ను ప్రసన్నం చేసుకునేందుకు కొందరు నేతలు అమరావతిని శ్మశానంతో పోల్చారని గుర్తు చేశారు. మూడు రాజధానుల విధానాన్ని ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా తిరస్కరించారని మంత్రి పేర్కొన్నారు. ఇప్పుడు "మావిగన్" పేరుతో కొత్త చర్చలు తెరపైకి తేవడాన్ని ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు. వైసీపీ పాలనలో అమరావతిలో చెప్పుకోదగ్గ నిర్మాణం జరగలేదని విమర్శించారు.

ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి

4
GENERAL NEWS
ఆదివారం 28 జూన్ 2026
www.prabhathakiranam.com

# ఓటు హక్కు రక్షణకు భరోసా

- కూకట్‌పల్లి ప్రజలకు ఎమ్మెల్యే మాధవరం పిలుపు
- ఎస్ఐఆర్‌లో ఎమ్మెల్యే చొరవ

ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర పరిశీలన (SIR) కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మరోసారి ప్రజల పక్షాన నిలిచారు. కూకట్‌పల్లి మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు, ఇతర అధికారులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వెళ్లి ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను తెలియజేశారు. ఎమ్మెల్యేకు ఎన్యూమరేషన్ ఫారాన్ని అందజేసి, ఆయన కుటుంబ సభ్యుల ఓటరు వివరాలను కూడా పరిశీలించారు.

**• ముందుగా తన సందేహాలే నివృత్తి**

ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో ఎలాంటి అపోహలు ఉండకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్వయంగా అధికారులను ప్రశ్నించి తన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రతి అంశాన్ని తెలుసుకుని, ఆ సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలనే ఉద్దేశంతో వ్యవహరించారు.

**• ఓటర్లకు భరోసా**

అనంతరం మాట్లాడిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగ హక్కు అని అన్నారు. అధికారులు ఇంటికి వచ్చినప్పుడు సహకరించి, తమ వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే నివృత్తి చేసుకోవాలని కోరారు.

‘మీ ఓటు కోసం... నేను ఉన్నాను’

కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎవరైనా ఓటర్లు ఎస్ఐఆర్‌కు సంబంధించి ఇబ్బందులు ఎదుర్కొన్నా, సందేహాలు ఉన్నా నేరుగా తనను సంప్రదించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. 93941 15559 నంబర్‌కు ఫోన్ చేస్తే అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రతి ఓటరి హక్కు కాపాడే వరకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.



**• ప్రజల విశ్వాసమే లక్ష్యం**

ప్రజల ఓటు హక్కు పరిరక్షణే తన లక్ష్యమని, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ పార్టీ సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి గజ్జెల నగేష్‌తో పాటు పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# పౌరసత్వం వేరు... పాస్‌పోర్టు వేరు

**పాస్‌పోర్టుపై ఒవైసీకి కిషన్ కౌంటర్**

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాస్‌పోర్టు, పౌరసత్వంపై చేసిన వ్యాఖ్యలు చట్టపరంగా తప్పుదారి పట్టించేవని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. ప్రజాప్రతినిధిగా, న్యాయవాదిగా ఉన్న ఒవైసీకి ఈ రెండింటి మధ్య తేడా తెలిసి ఉండాలని అన్నారు. పాస్‌పోర్టు అనేది విదేశీ ప్రయాణానికి ఉపయోగించే పత్రం మాత్రమేనని, అది ఒక్కటే భారత పౌరసత్వానికి తుది ఆధారం కాదని స్పష్టం చేశారు. భారత పౌరసత్వం రాజ్యాంగం, పౌరసత్వ చట్టం 1955 ప్రకారమే నిర్ణయించబడుతుందని పేర్కొన్నారు. విదేశాంగ శాఖ ఎలాంటి కొత్త నిబంధన తీసుకురాలేదని, ఇప్పటికే అమల్లో ఉన్న చట్టాన్నే మరోసారి వివరించిందని తెలిపారు. ప్రజల్లో అయోమయం కలిగించే వ్యాఖ్యలు చేయకుండా చట్టాలను అధ్యయనం చేయాలని ఒవైసీకి సూచించారు.



5లో..

# అఫ్గానిస్థాన్ భూకంపం

**ఢిల్లీలో కంపించిన భూమి • ఉత్తర భారతంలో వణుకు**

**ప్రజల్లో ఒక్కసారిగా ఆందోళన**

అఫ్గానిస్థాన్‌లో శనివారం సాయంత్రం సంభవించిన శక్తివంతమైన భూకంపం ప్రభావం ఉత్తర భారతదేశంలోనూ కనిపించింది. ఢిల్లీ, జమ్మూ కశ్మీర్‌తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో భూమి కంపించింది. ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలో ఉన్నవారు, కార్యాలయాల్లో పనిచేస్తున్నవారు వెంటనే బయటకు పరుగులు తీశారు.



# నాలుగు తరాల భూ వివాదం

**69 ఏళ్ల వివాదానికి ముగింపు**

**సేల్ డీడ్‌కు గ్రీన్ సిగ్నల్ • సుప్రీంకోర్టు కీలక తీర్పు**

దాదాపు నాలుగు తరాలుగా కొనసాగుతున్న భూ వివాదానికి సుప్రీంకోర్టు ముగింపు పలికింది. 1957లో జరిగిన భూమి అమ్మకపు ఒప్పందం చట్టబద్ధమేనని స్పష్టం చేస్తూ కీలక తీర్పు వెలువరించింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎన్.వి. అంజరియా ధర్మాసనం ఈ తీర్పు ఇచ్చింది. దీంతో దశాబ్దాలుగా సాగుతున్న న్యాయపోరాటానికి తెరపడింది. (3లో..)




# డ్రైవర్లే యాజమానులు

**• భారత్ ట్యాక్సీకి అమిత్ షా శ్రీకారం**

**• రెండేళ్లలో 500 నగరాలకు విస్తరణ • గుజరాత్‌లో సేవల ప్రారంభం**

కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్‌లో “భారత్ ట్యాక్సీ” సేవలను ప్రారంభించారు. కోఆపరేటివ్ విధానంలో రూపొందించిన ఈ సేవలో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండటం ప్రత్యేకత అని చెప్పారు. ప్రస్తుతం ప్రజల రోజువారీ జీవితంలో ట్యాక్సీ సేవలు అత్యవసరంగా మారాయని పేర్కొన్నారు. డ్రైవర్లకు న్యాయం చేసే ప్రత్యామ్నాయ వ్యవస్థగా భారత్ ట్యాక్సీ నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. (వివరాలు 3లో..)


5లో..

# మెట్రో అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- అదనపు బాధ్యతలు అప్పగింత

# కేంద్రంపై పోరాటం

- **వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఆమోదించం**
- **అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్తాం**
- **ఉపాధి చట్టంపై ఉత్తమ్ హెచ్చరిక**

గ్రామీణ ఉపాధి హామీ వ్యవస్థలో మార్పులకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీజీ రామ్ జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది సాధారణ చట్ట సవరణ కాదని, రాష్ట్రాల అధికారాలను బలహీనపరిచే ప్రయత్నమని విమర్శించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.


5లో..


6లో..

ఏఐ చిత్రం

# సెకండ్ ఒపీనియన్.. పెరుగుతుంది లైఫ్ లైన్

## వ్యాధి ఏదైనా.. చికిత్స ఎలాంటిదైనా...

**మొదటి నిర్ణయమే చివరిది కాదు • ప్రాణాలను కాపాడే రెండో అభిప్రాయం**

**ఒక్క డాక్టర్ మాటే అంతిమం కాదు!**

ఆరోగ్య సమస్య వచ్చిందంటే చాలామంది డాక్టర్ చెప్పిందే తుది నిర్ణయంగా భావిస్తారు. ముఖ్యంగా శస్త్రచికిత్స చేయాలని, గుండె చికిత్సలు, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధికి చికిత్స ప్రారంభించాలని సూచించినప్పుడు భయం, సందేహం, ఆందోళన సహజం. అలాంటి సమయంలో మరో నిపుణుడి అభిప్రాయం తీసుకోవడం ఆలస్యం కాదు... అది తెలివైన నిర్ణయం అని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనినే ‘సెకండ్ ఒపీనియన్’ అంటారు. ప్రపంచవ్యాప్తంగా ఇది ఇప్పుడు సాధారణ వైద్య విధానంగా మారింది. రెండో అభిప్రాయం వల్ల వ్యాధి నిర్ధారణలో మార్పు రావచ్చు. చికిత్స విధానం మారే అవకాశం ఉంటుంది. అవసరం లేని శస్త్రచికిత్సల నుంచి తప్పించుకోవచ్చు. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులు, మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలు, అరుదైన వ్యాధుల విషయంలో ఇది మరింత ఉపయోగపడుతుంది. ఒక డాక్టర్ చెప్పిన మాటను ప్రశ్నించడం కాదు, మన ఆరోగ్యంపై పూర్తి అవగాహనతో సరైన నిర్ణయం తీసుకోవడమే దీని అసలు ఉద్దేశం. వైద్యులే కూడా అవసరమైన సందర్భాల్లో రెండో అభిప్రాయాన్ని స్వాగతిస్తుండటం విశేషం. ఆరోగ్యంపై ధైర్యం, నమ్మకం, స్పష్టత పెంచే ఈ విధానం ప్రతి రోగి తెలుసుకోవాల్సిన కీలక అంశంగా మారింది.

# మహేశ్వరం సబితమ్మదే!

- ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలుపు పక్కా
- వాగ్దానాలు మరిచిన రేవంత్ పాలన
- ఎన్నికలకు సిద్ధం కావాలన్న కేటీఆర్


5లో..

# ముగ్గురు సీఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

**చీకటి ఒప్పందాలేంటో ప్రజలకు చెప్పండి**

**తెలంగాణ హక్కులుకు భంగం కలిగేలా నిర్ణయాలు**

**భేటీ వివరాలు వెల్లడించాలని హరీశ్ రావు డిమాండ్**


5లో..

# ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న తెలంగాణ రైజింగ్

»నైపుణ్యంతోనే పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు

»ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న “తెలంగాణ రైజింగ్” విజన్ దేశీయ, అంతర్జాతీయ సంస్థల దృష్టిని ఆకర్షిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో యువతను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం వేగంగా పనిచేస్తోందని వివరించారు.

**• ప్రముఖ సంస్థల్లో ఉద్యోగాలు**

తెలంగాణలో శిక్షణ పొందిన యువతకు ప్రముఖ బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ఇటీవల జరిగిన నియామకాల్లో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థలో 47 మంది యువత ఉద్యోగాలు సాధించారని తెలిపారు. పుణెలోని టాటా మోటార్స్ యూనిట్‌లో 36 మంది విద్యార్థులు ఎంపికయ్యారని వెల్లడించారు. ఫాక్స్‌కాన్ సంస్థకు చెందిన ఆపిల్ ఐఫోన్ విభాగంలో 14 మంది మహిళా విద్యార్థినులు ఉద్యోగాలు పొందడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు.

**• ఉపాధి కల్పనపై ప్రత్యేక దృష్టి**

బ్లూ కాలర్ ఉద్యోగాల రంగంలో తెలంగాణను దేశానికే కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన యువతకు ఉద్యోగాలు కల్పించే విధంగా పరిశ్రమలతో సమన్వయం పెంచుతున్నట్లు వెల్లడించారు.

**• పెట్టుబడులకు తెలంగాణే గమ్యం**

నైపుణ్యవంతమైన మానవ వనరులు, పరిశ్రమలకు అనుకూల విధానాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు ప్రపంచస్థాయి సంస్థలను తెలంగాణ వైపు ఆకర్షిస్తున్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అంతర్జాతీయ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెరిగే కొద్దీ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయని సీఎం స్పష్టం చేశారు.



# సినిమాకు మించిన స్టోరీ



- **ముందు కత్తిపోట్లు**
- **ఆ తర్వాత కారు పేలుడు**

**మంటల్లో సజీవ దహనం**

- **ఇలా కూడా జరుగుతాయా?**

కర్ణాటకలోని తుమకూరు జిల్లాలో శనివారం సంచలన ఘటన చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి యువతిపై కత్తితో దాడి చేసిన కొద్దిసేపటికే వాహనం పేలిపోయి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో నాగేంద్ర అనే 30 ఏళ్ల వ్యక్తి సజీవ దహనమయ్యాడు. తీవ్రంగా గాయపడిన రమ్య ఉల్లాస్ అనే 23 ఏళ్ల యువతిని జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. (వివరాలు 3లో..)



# హైదరాబాద్‌లో ట్రంప్ అవెన్యూ

**భారత్‌కు ట్రంప్ స్పెషల్ థ్యాంక్స్**

# ఇండియాకు ట్రంప్

- **వచ్చే ఏడాది రానున్న అమెరికా అధ్యక్షుడు**
- **ఖరారు చేసిన అమెరికా విదేశాంగ మంత్రి**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత్ పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తానని చెప్పారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి భారత పర్యటన ఇదేనని పేర్కొన్నారు.
(5లో..)

# హిస్టరీగా పూణె మర్డర్ మిస్టరీ

ఒక్క “నో” చెప్పలేకపోతే... ఒక ప్రాణం పోతుందా? పూణె హత్య కేసు ఇప్పుడు కేవలం ఓ క్రైమ్ స్టోరీ కాదు. చదువుకున్న యువత, కుటుంబ వ్యవస్థ, పెళ్లి నిర్ణయాలు, వ్యక్తిగత స్వేచ్ఛపై దేశవ్యాప్తంగా చర్చకు దారి తీసిన ఘటనగా మారింది. వివాహం ఇష్టం లేకపోయినా ధైర్యంగా చెప్పలేకపోవడం, కుటుంబ పరువు పేరుతో మౌనం ఎంచుకోవడం, ఆ మౌనం చివరకు విషాదానికి దారితీయడం సమాజాన్ని కలవరపెడుతోంది. ఒకవైపు పోలీసులు కుట్ర కోణంలో దర్యాప్తు కొనసాగిస్తుండగా, మరోవైపు సభ్య సమాజం మాత్రం అసలు సమస్య ఎక్కడుందనే ప్రశ్నకు సమాధానం వెతుకుతోంది. పెళ్లి అంటే ఇద్దరి మనసుల కలయికా, కుటుంబాల ప్రతిష్ఠా? “వద్దు” అనే హక్కు నిజంగానే యువతకు ఉందా? నిజం చెప్పే ధైర్యాన్ని మనం పిల్లలకు నేర్పుతున్నామా? లేక మౌనాన్ని మాత్రమే అలవాటు చేస్తున్నామా? పూణే ఘటన ఒక్క కుటుంబాన్ని కాదు, మొత్తం సమాజాన్ని అద్దంలా నిలబెట్టి ఆలోచింపజేస్తోంది. ఒక నిజమైన “నో” తాత్కాలిక బాధ కలిగించవచ్చు. కానీ చెప్పని నిజం ఎన్నో జీవితాలను శాశ్వత చీకటిలోకి నెట్టే ప్రమాదం ఉందనే హెచ్చరికగా ఈ ఘటన నిలిచిపోయింది.

**రోజుకో ట్విస్ట్.. క్రైమ్ స్టోరీ**

## పెళ్లి రద్దు కంటే హత్యే సులభమా?

- పోలీసులకు సంచలన వాంగ్మూలం
- దర్యాప్తులో వెలుగులోకి నిజాలు

3లో..

# నో అనే ఒక్క మాట.. చంపేసింది

## పూణే హత్య కేసులో మౌనం పాత్ర

- నిశ్చితార్థం నుంచి హత్య వరకు
- మిట్టల్ కుటుంబం కేంద్రబిందువు
- పెళ్లి సంబంధం వెనుక కీలక పాత్ర

ఒక హత్య జరిగింది. ఒక యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు కుట్ర కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు ఎవరు, శిక్ష ఏమిటి అనేది కోర్టు తేల్చాల్సిన విషయం. కానీ ఈ ఘటన సమాజం ముందు మరో పెద్ద ప్రశ్నను నిలబెట్టింది. చదువుకున్న యువత తమ జీవిత భాగస్వామిని గురించి నిజమైన నిర్ణయం తీసుకునే ధైర్యాన్ని ఎందుకు కోల్పోతోంది? “ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు” అని చెప్పే స్వేచ్ఛ ఎందుకు అంత కష్టంగా మారుతోంది?



# నేడు తెలంగాణలో పల్స్ పోలియో

- ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరి
- రాష్ట్రవ్యాప్తంగా పోలియో కార్యక్రమం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నవజాత శిశువుల నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా అన్ని జిల్లాల్లో విస్తృత ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

### ప్రత్యేకంగా పర్యవేక్షించిన మంత్రి

జూన్ 28న రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలియో బూత్‌లలో చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తారు. జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి బూత్‌లకు రాని చిన్నారులను గుర్తించి పోలియో చుక్కలు వేయనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లో పట్టణ ప్రాంతాలు ఎక్కువగా ఉండటంతో జూలై 1న అదనంగా మరో రోజు కార్యక్రమం కొనసాగించనున్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై ఇప్పటికే మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా బూత్‌లు, మొబైల్ బృందాలు, ఇంటింటి సర్వేలను సమర్థంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి



లోపాలకు అవకాశం లేకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

### ప్రమాద ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి

వలస కార్మికుల పిల్లలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రాంతాలు, పట్టణ బస్తీలు, కొత్త కాలనీలు, గిరిజన ప్రాంతాల్లో నివసించే చిన్నారులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, మున్సిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖ, విద్యాశాఖ, ఆర్టీసీ సహా వివిధ శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో చివరి పోలియో కేసు 2007లో నమోదైందని అధికారులు గుర్తు చేశారు. అప్పటి నుంచి పోలియో రహిత హోదాను కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ విజయాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని విజ్ఞప్తి చేశారు.



# ఇండియాకు ట్రంప్

- వచ్చే ఏడాది రానున్న అమెరికా అధ్యక్షుడు
- ఖరారు చేసిన అమెరికా విదేశాంగ మంత్రి

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వచ్చే ఏడాది ఆరంభంలో భారత్ పర్యటనకు వచ్చే అవకాశాలు ఉన్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో వెల్లడించారు. ట్రంప్ పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ ఏడాది చివర్లో తాను భారత్‌కు వచ్చి పర్యటన ఏర్పాట్లను సమీక్షిస్తానని చెప్పారు. ట్రంప్ రెండోసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి భారత పర్యటన ఇదేనని పేర్కొన్నారు.

### భారత్-అమెరికా బంధంపై ప్రశంసలు

భారత్, అమెరికా మధ్య సంబంధాలు ప్రస్తుతం అత్యంత బలంగా ఉన్నాయని మార్కో రుబియో కొనియాడారు. అమెరికాకు భారత్ అత్యంత సన్నిహిత వ్యూహాత్మక భాగస్వామి అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఉన్న వ్యక్తిగత అనుబంధం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేస్తోందని వ్యాఖ్యానించారు. ఈ స్నేహం రెండు దేశాల సహకారాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్తోందని తెలిపారు.

### వాణిజ్య ఒప్పందం తుది దశలో

ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన జీ7 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, ట్రంప్ మధ్య వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరిగాయని రుబియో వెల్లడించారు. ప్రస్తుతం రెండు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. ఈ ఒప్పందం త్వరలోనే ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీని వల్ల ఆర్థిక, వ్యూహాత్మక సంబంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు.

### ఇంధన రంగంలో సహకారం

ఇంధన భద్రత విషయంలో భారత్, అమెరికా కలిసి పనిచేస్తున్నాయని రుబియో తెలిపారు. చమురును శుద్ధి చేసే సామర్థ్యం ఉన్న కీలక దేశాల్లో భారత్ ఒకటని చెప్పారు. ఇంధన రంగంలో పరస్పర సహకారం పెరగడం వల్ల రెండు దేశాలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఈ రంగంలో మరిన్ని ఒప్పందాలు కుదిరే అవకాశం ఉందని సూచించారు.

### మోదీపై రుబియో ప్రశంసలు

ప్రధాని నరేంద్ర మోదీపై మార్కో రుబియో ప్రశంసలు కురిపించారు. తాను మోదీకి అభిమానినని వెల్లడించారు. ప్రపంచ వేదికపై భారతదేశ ప్రతిష్ఠను పెంచిన నాయకుడిగా మోదీని అభివర్ణించారు. భారత్‌ను ప్రపంచ శక్తిగా తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అలాగే క్వాడ్ దేశాల నేతల సమావేశాన్ని కూడా త్వరలో నిర్వహించాలని అమెరికా ఎదురుచూస్తోందని తెలిపారు. భారత్‌తో బలమైన భాగస్వామ్యాన్ని మరింత విస్తరించడమే అమెరికా లక్ష్యమని రుబియో స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో ట్రంప్ అవెన్యూ

### భారత్‌కు ట్రంప్ స్పెషల్ థ్యాంక్స్




హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ సమీప రహదారికి "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ" అని పేరు పెట్టిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. ఈ గౌరవం అందించినందుకు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన సామాజిక మాధ్యమ వేదిక "ట్రూత్"లో పోస్టు చేస్తూ, "ఈ విధంగా గౌరవం పొందిన తొలి అమెరికా అధ్యక్షుడిని నేను. ధన్యవాదాలు భారత్" అని పేర్కొన్నారు.

### ప్రత్యేక కార్యక్రమంలో నామకరణం

అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 23న హైదరాబాద్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆ సందర్భంగా అమెరికా కాన్సులేట్ పక్కనున్న రహదారికి "డొనాల్డ్ ట్రంప్ అవెన్యూ"గా నామకరణం చేశారు. ఈ ప్రత్యేక ఫలకాన్ని అమెరికా రాయబారి సెర్గియో గోర్‌తో కలిసి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు.

### కీలక సంస్థలకు కేంద్ర బిందువుగా రహదారి

ఈ రహదారి సమీపంలో మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి ప్రముఖ అమెరికన్ టెక్నాలజీ సంస్థల కార్యాలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రహదారికి ట్రంప్ పేరు పెట్టడం భారత్‌అమెరికా ద్వైపాక్షిక సంబంధాలకు గుర్తింపుగా తెలంగాణ ప్రభుత్వం పేర్కొంది. హైదరాబాద్ అంతర్జాతీయ సాంకేతిక కేంద్రంగా ఎదుగుతున్న విషయాన్ని ప్రతిబింబించే నిర్ణయమని వివరించింది.

### భారత్-అమెరికా బంధానికి మరో గుర్తింపు

ట్రంప్ స్పందనతో ఈ నిర్ణయం అంతర్జాతీయ స్థాయిలో మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. భారత్, అమెరికా మధ్య స్నేహపూర్వక సంబంధాలు మరింత బలోపేతం అవుతున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి పెట్టుబడులు, సాంకేతిక సంస్థలు వస్తున్న సమయంలో ఈ తరహా ప్రతీకాత్మక నిర్ణయాలు నగర ప్రతిష్ఠను మరింత పెంచుతాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మహేశ్వరం సబితమ్మదే!

- ఎప్పుడు ఎన్నికలు జరిగినా గెలుపు పక్కా
- ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్
- వాగ్దానాలు మరిచిన రేవంత్ పాలన
- ఎన్నికలకు సిద్ధం కావాలన్న కేటీఆర్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కార్యకర్తలకు అవగాహన కల్పించిన ఆయన, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా ప్రతి కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ చేపడుతున్న ప్రక్రియను అత్యంత బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.

### డిజిటల్ సభ్యత్వానికి శ్రీకారం

త్వరలో ప్రారంభం కానున్న డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని భారీ విజయవంతం చేయాలని కేటీఆర్ కోరారు. ప్రతి కార్యకర్తకు పార్టీ తరఫున ప్రత్యేక గుర్తింపు కార్డు అందిస్తామని చెప్పారు. ఆ గుర్తింపు కార్డు కార్యకర్తలకు గౌరవాన్ని తీసుకొస్తుందని పేర్కొన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకొని పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

### ఫ్యూచర్ సిటీ... కాంగ్రెస్‌ను టార్గెట్

మహేశ్వరం, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఐదు లక్షల ఉద్యోగాల లక్ష్యంతో బీఆర్ఎస్ ప్రభుత్వం 14 వేల ఎకరాల భూమి సేకరించిందని కేటీఆర్ గుర్తు చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు రైతులను రెచ్చగొట్టి అధికారంలోకి వస్తే భూములు తిరిగి ఇస్తామని హామీలు ఇచ్చారని విమర్శించారు. ఇప్పుడు అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో ఏకంగా 30 వేల ఎకరాలు సేకరించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

### సబితమ్మ గెలుపు ఖాయమన్న కేటీఆర్

మహేశ్వరం నియోజకవర్గంలో కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయంపై ఎలాంటి సందేహం లేదని కేటీఆర్ అన్నారు. ప్రతి బూత్‌లో పార్టీకి మెజారిటీ రావాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సబితా ఇంద్రారెడ్డి మరోసారి విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌కు వ్యతిరేక వాతావరణం ఏర్పడుతోందని వ్యాఖ్యానించారు.

### కాంగ్రెస్ పాలనపై విమర్శలు

రాష్ట్రంలో వికాసం తగ్గిపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్ కిట్, రైతుబంధు వంటి సంక్షేమ పథకాలు లేకుండా పోయాయని విమర్శించారు. ప్రస్తుతం సంక్షేమం కంటే కుంభకోణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఉన్నా ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితోనే బీఆర్ఎస్ మళ్లీ ప్రజల్లోకి వెళ్తుందని, వచ్చే ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు.





# కేంద్రంపై పోరాటం

- వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఆమోదించం
- అవసరమైతే సుప్రీంకోర్టుకైనా వెళ్తాం
- ఉపాధి చట్టంపై ఉత్తమ్ హెచ్చరిక

గ్రామీణ ఉపాధి హామీ వ్యవస్థలో మార్పులకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదిత వీబీజీ రామ్‌జీ చట్టం-2025ను తెలంగాణ ప్రభుత్వం యథాతథంగా అంగీకరించబోదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది సాధారణ చట్ట సవరణ కాదని, రాష్ట్రాల అధికారాలను బలహీనపరిచే ప్రయత్నమని విమర్శించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశం అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### రాష్ట్ర హక్కులను కాపాడుతాం

గ్రామీణాభివృద్ధిపై రాష్ట్రాల పాత్రను తగ్గించే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొస్తోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల ప్రయోజనాలకు భంగం కలిగించే నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. ప్రజల హక్కులను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని చెప్పారు.

### సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సిద్ధం

ఈ చట్టంలోని పలు నిబంధనలు రాజ్యాంగ విరుద్ధంగా ఉన్నాయని న్యాయ నిపుణులు ఉపసంఘానికి వివరించారని మంత్రి తెలిపారు. అవసరమైతే ఈ చట్టాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. రాష్ట్రాల హక్కులను పరిరక్షించే విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

### ఇతర రాష్ట్రాలతో ఉమ్మడి కార్యాచరణ

కర్ణాటక, కేరళ రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి న్యాయపరమైన, రాజకీయ కార్యాచరణ చేపట్టాలని ఉపసంఘం నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేసే రాష్ట్రాలన్నీ కలిసి కేంద్ర నిర్ణయాన్ని వ్యతిరేకించాలని భావిస్తున్నట్లు చెప్పారు. ఈ అంశంపై ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు.

### 200 రోజుల ఉపాధికి మద్దతు

సమావేశంలో పాల్గొన్న పౌరసంఘాలు కేంద్ర ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించినట్లు మంత్రి తెలిపారు. 60 రోజుల ఉపాధి పరిమితిని రద్దు చేసి ప్రతి గ్రామీణ కుటుంబానికి కనీసం 200 రోజుల ఉపాధి హామీ కల్పించాలని వారు సూచించినట్లు చెప్పారు. చట్టబద్ధ కనీస వేతనాలు కూడా అమలు చేయాలని కోరినట్లు వెల్లడించారు. కేంద్రం ప్రతిపాదించిన 60:40 నిధుల భాగస్వామ్య విధానం తెలంగాణపై భారీ ఆర్థిక భారం మోపే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

### జూలై 2న కేబినెట్ తుది నిర్ణయం

ఈ అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో సమగ్రంగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అవసరమైతే రాష్ట్రానికి ప్రత్యేక చట్టం తీసుకురావడం, సుప్రీంకోర్టును ఆశ్రయించడం, ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి పోరాటం చేపట్టడం వంటి అన్ని ప్రత్యామ్నాయాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు. తెలంగాణ హక్కులు, గ్రామీణ పేదల జీవనోపాధిని కాపాడే విషయంలో ప్రభుత్వం రాజీపడబోదని స్పష్టం చేశారు.

# ముగ్గురు సీఎంలు ఏం మాట్లాడుకున్నారు ?

- చీకటి ఒప్పందాలేంటో ప్రజలకు చెప్పండి
- తెలంగాణ హక్కులుకు భంగం కలిగేలా నిర్ణయాలు
- భేటీ వివరాలు వెల్లడించాలని హరీశ్ రావు డిమాండ్

బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మరోసారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఇటీవల కర్ణాటకలో ముగ్గురు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య జరిగిన సమావేశంలో అసలు ఏం చర్చ జరిగిందో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ సమావేశంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు కూడా లేకుండా నలుగురే సమావేశమయ్యారని పేర్కొన్నారు. ఆ భేటీలో జరిగిన చర్చలు తెలంగాణ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు.

### ప్రాజెక్టులపై తీవ్ర అభ్యంతరం

కర్ణాటకలో నవేలి, ఆంధ్రప్రదేశ్‌లో గుండ్రేవుల ప్రాజెక్టులను ముందుకు తీసుకెళ్తామని చెబుతుంటే, దానిని చారిత్రక ఒప్పందంగా అభివర్ణించడం సరికాదని హరీశ్ రావు అన్నారు. గతంలో గుండ్రేవుల ప్రాజెక్టు ముందుకు రాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుందని గుర్తుచేశారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మళ్లీ ఆ ప్రాజెక్టును తెరపైకి తీసుకురావడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని ఆరోపించారు.

### నీటి వాటాలపై ప్రశ్నలు

ఆర్డీఎస్‌కు పక్కా నీటి కేటాయింపులపై ఎలాంటి హామీ వచ్చిందో ప్రభుత్వం ప్రజలకు చెప్పాలని హరీశ్ రావు కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నీటి వాటాల అంశంపై సరైన అవగాహన లేదని విమర్శించారు. తెలంగాణ హక్కుల విషయంలో ముఖ్యమంత్రి రాజీ పడినా బీఆర్ఎస్ మాత్రం రాజీ పడదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో తమ పార్టీ పోరాటం కొనసాగుతుందని చెప్పారు.



### బీఆర్ఎస్ హయాంలో సాధించిన ప్రగతి

కాంగ్రెస్ పాలనలో ప్రతి ఏడాది సగటున నాలుగు టీఎంసీలకు మాత్రమే అనుమతులు వచ్చాయని హరీశ్ రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది సగటున 44 టీఎంసీల చొప్పున అనుమతులు సాధించామని తెలిపారు. తెలంగాణకు రావాల్సిన 968 టీఎంసీలలో 830 టీఎంసీలకు అనుమతులు తెచ్చుకున్నామని, మిగిలిన వాటి కోసం కూడా కృషి చేశామని గుర్తుచేశారు.

### కాంగ్రెస్ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టును నిర్మిస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. పాలమూరు ప్రాంతం నీటి సమస్యతో ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. మేడిగడ్డ గేట్ల మరమ్మతులు చేయలేని ప్రభుత్వం తుంగభద్ర గేట్ల పనులపై దృష్టి పెట్టడం విడ్డూరమని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులకు ఎలాంటి అన్యాయం జరిగినా బీఆర్ఎస్ మౌనంగా ఉండదని, అవసరమైతే ఉద్యమానికి సిద్ధమవుతామని హరీశ్ రావు హెచ్చరించారు.

# అఫ్ఘానిస్థాన్ భూకంపం

- ఢిల్లీలో కంపించిన భూమి
- ఉత్తర భారతంలో వణుకు
- ప్రజల్లో ఒక్కసారిగా ఆందోళన




అఫ్ఘానిస్థాన్‌లో శనివారం సాయంత్రం సంభవించిన శక్తివంతమైన భూకంపం ప్రభావం ఉత్తర భారతదేశంలోనూ కనిపించింది. ఢిల్లీ, జమ్మూ కశ్మీర్‌తో పాటు పలు ఉత్తరాది రాష్ట్రాల్లో భూమి కంపించింది. ఒక్కసారిగా ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇళ్లలో ఉన్నవారు, కార్యాలయాల్లో పనిచేస్తున్నవారు వెంటనే బయటకు పరుగులు తీశారు.

### రిచ్టర్ స్కేలుపై 6.2 తీవ్రత

భారత ప్రభుత్వానికి చెందిన నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వివరాల ప్రకారం ఈ భూకంప తీవ్రత రిచ్టర్ స్కేలుపై 6.2గా నమోదైంది. భూకంప కేంద్రం అఫ్ఘానిస్థాన్‌లో ఉందని వెల్లడించింది. భూమికి సుమారు 215 కిలోమీటర్ల లోతులో ఈ ప్రకంపనలు సంభవించినట్లు అధికారులు తెలిపారు. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం ఈ భూకంప కేంద్రం జుర్మ్ పట్టణానికి దక్షిణ దిశగా సుమారు 43 కిలోమీటర్ల దూరంలో ఉంది.

## పలు దేశాల్లో ప్రకంపనలు

ఈ భూకంప ప్రభావం అఫ్ఘానిస్థాన్ రాజధాని కాబూల్‌తో పాటు ఖోస్ట్, నంగర్‌హార్ ప్రాంతాల్లో స్పష్టంగా కనిపించింది. పొరుగుదేశం పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్, స్వాత్, హంగూ, ఉత్తర వజీరిస్థాన్, చిత్రాల్, రావల్పిండి ప్రాంతాల్లో కూడా భూమి కంపించింది. విస్తృత ప్రాంతాల్లో ఒకేసారి ప్రకంపనలు నమోదవడంతో ప్రజలు అప్రమత్తమయ్యారు.

### ఢిల్లీలో భయాందోళన

జాతీయ రాజధాని ఢిల్లీలో ప్రకంపనలు కొన్ని సెకన్ల పాటు కొనసాగాయి. అపార్ట్‌మెంట్లు, కార్యాలయ భవనాల్లో ఉన్నవారు వెంటనే బయటకు వచ్చి సురక్షిత ప్రాంతాల్లో నిలిచారు. అధికారులు పరిస్థితిని పరిశీలించినప్పటికీ ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు తొలి సమాచారం లేదు. అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచనలు చేశారు.

### తాజా భూకంపాలపై ఆందోళన

ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా అఫ్ఘానిస్థాన్‌లో వచ్చిన భూకంప ప్రభావం ఢిల్లీతో పాటు ఉత్తర భారతదేశంలో కనిపించింది. తాజాగా మరోసారి అదే ప్రాంతంలో శక్తివంతమైన ప్రకంపనలు రావడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల వెనిజులాలో వరుస భూకంపాలు భారీ ప్రాణనష్టానికి కారణమైన నేపథ్యంలో ఈ ఘటనపై కూడా అధికారులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. భూకంపం ప్రభావంపై సంబంధిత సంస్థలు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నాయి

# మెట్రో అదనపు ఎండీగా అజిత్ రెడ్డి

- రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- అదనపు బాధ్యతలు అప్పగింత

తెలంగాణ సీనియర్ ఐఏఎస్ అధికారి అజిత్ రెడ్డికి ప్రభుత్వం మరో కీలక బాధ్యత అప్పగించింది. ప్రస్తుతం ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా కొనసాగుతున్న ఆయనను హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఆదేశాలు వెలువరించింది. తాజా నిర్ణయంతో అజిత్ రెడ్డి రెండు కీలక బాధ్యతలను ఒకేసారి నిర్వహించనున్నారు.

### రెండు పదవుల్లో బాధ్యతలు

తాజా ఉత్తర్వుల ప్రకారం అజిత్ రెడ్డి ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా తన బాధ్యతలను కొనసాగిస్తూనే హైదరాబాద్ మెట్రో రైల్ అదనపు ఎండీగా కూడా విధులు నిర్వర్తిస్తారు. ఇటీవలే ఆయనను ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే. బదిలీ జరిగిన కొద్ది రోజులకే మరో కీలక బాధ్యత అప్పగించడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

### మెట్రో అదనపు ఎండీగా అజిత్ రెడ్డి మెట్రో నిర్వహణకు బలం

ప్రస్తుతం హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సర్ఫరాజ్ అహ్మద్ కొనసాగుతున్నారు. అజిత్ రెడ్డి అదనపు ఎండీగా బాధ్యతలు చేపట్టడంతో మెట్రో పరిపాలన మరింత బలోపేతం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా విస్తరణ పనులు, ప్రా



జెక్టుల అమలు, పరిపాలనా సమన్వయం వేగవంతం కావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

### పెట్టుబడులు, మౌలిక వసతులపై దృష్టి

ఇన్వెస్ట్ తెలంగాణ సీఈఓగా పరిశ్రమల పెట్టుబడులను ఆకర్షించే బాధ్యతలు నిర్వహిస్తున్న అజిత్ రెడ్డికి ఇప్పుడు మెట్రో రైల్ వ్యవస్థలోనూ కీలక పాత్ర దక్కింది. రాష్ట్ర అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల విస్తరణకు ఈ నియామకం ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. పరిపాలనా అనుభవం, సమన్వయ సామర్థ్యంతో హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుల పురోగతికి ఈ నిర్ణయం దోహదపడుతుందని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# సెకండ్ ఒపీనియన్.. పెరుగుతుంది లైఫ్ లైన్



ఆరోగ్య సమస్య వచ్చిందంటే చాలామంది డాక్టర్ చెప్పిందే తుది నిర్ణయంగా భావిస్తారు. ముఖ్యంగా శస్త్రచికిత్స చేయాలని, గుండె చికిత్సలు, కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధికి చికిత్స ప్రారంభించాలని సూచించినప్పుడు భయం, సందేహం, ఆందోళన సహజం. అలాంటి సమయంలో మరో నిపుణుడి అభిప్రాయం తీసుకోవడం ఆలస్యం కాదు... అది తెలివైన నిర్ణయం అని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనినే 'సెకండ్ ఒపీనియన్' అంటారు. ప్రపంచవ్యాప్తంగా ఇది ఇప్పుడు సాధారణ వైద్య విధానంగా మారింది. రెండో అభిప్రాయం వల్ల వ్యాధి నిర్ధారణలో మార్పు రావచ్చు. చికిత్స విధానం మారే అవకాశం ఉంటుంది. అవసరం లేని శస్త్రచికిత్సల నుంచి తప్పించుకోవచ్చు. ముఖ్యంగా క్యాన్సర్, గుండె జబ్బులు, మెదడు, వెన్నెముక శస్త్రచికిత్సలు, అరుదైన వ్యాధుల విషయంలో ఇది మరింత ఉపయోగపడుతుంది. ఒక డాక్టర్ చెప్పిన మాటను ప్రశ్నించడం కాదు, మన ఆరోగ్యంపై పూర్తి అవగాహనతో సరైన నిర్ణయం తీసుకోవడమే దీని అసలు ఉద్దేశం. వైద్యులే కూడా అవసరమైన సందర్భాల్లో రెండో అభిప్రాయాన్ని స్వాగతిస్తుండటం విశేషం. ఆరోగ్యంపై ధైర్యం, నమ్మకం, స్పష్టత పెంచే ఈ విధానం ప్రతి రోగి తెలుసుకోవాల్సిన కీలక అంశంగా మారింది.

- ◆ వ్యాధి ఏదైనా.. చికిత్స ఎలాంటిదైనా..
- ◆ మొదటి నిర్ణయమే చివరిది కాదు
- ◆ ప్రాణాలను కాపాడే రెండో అభిప్రాయం
- ◆ ఒక్క డాక్టర్ మాటే అంతిమం కాదు!



ఒక డాక్టర్ చెప్పిన చికిత్సను వెంటనే అంగీకరించాలా? లేక మరో వైద్యుడి అభిప్రాయం కూడా తీసుకోవాలా? ఈ సందేహం చాలా మందిలో ఉంటుంది. ముఖ్యంగా శస్త్రచికిత్స, క్యాన్సర్, గుండె జబ్బులు, క్లిష్టమైన వ్యాధుల విషయంలో ఈ ప్రశ్న మరింత ముఖ్యమవుతుంది. వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం రెండో వైద్యుడి సలహా తీసుకోవడం అనుమానం చూపడం కాదు. సరైన నిర్ణయం తీసుకునేందుకు ఉపయోగపడే మంచి అవకాశం. దీనివల్ల రోగిలో నమ్మకం పెరుగుతుంది. చికిత్సపై స్పష్టత వస్తుంది.

### • ఎందుకు అవసరమవుతుంది?

సాధారణంగా కడుపులో మంట, మింగడంలో ఇబ్బంది వంటి సమస్యలతో వైద్యుడిని కలిసిన వ్యక్తికి శస్త్రచికిత్స అవసరమని చెప్పినప్పుడు సహజంగానే భయం కలుగుతుంది. ఆ ఆపరేషన్ జీవితాంతం జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుందని తెలిసినప్పుడు మరో వైద్యుడిని సంప్రదించాలనే ఆలోచన రావడం సహజం. అలాంటి సమయంలో రెండో అభిప్రాయం తీసుకోవడం రోగికి ధైర్యాన్ని ఇస్తుంది. అదే చికిత్స సరైందా? మరో మార్గం ఉందా? అనే సందేహాలకు సమాధానం దొరుకుతుంది.

### • రోగుల హక్కుగా మారిన విధానం

గతంలో వైద్యుడు చెప్పిందే తుది నిర్ణయంగా భావించేవారు. కాలక్రమేణా రోగుల హక్కులకు ప్రాధాన్యం పెరిగింది. చికిత్స వల్ల కలిగే ప్రయోజనాలు, ప్రమాదాలు ముందుగానే వివరించడం వైద్యుల బాధ్యతగా మారింది. అదే సమయంలో అవసరమైతే మరో వైద్యుడి అభిప్రాయం తీసుకునే హక్కు కూడా రోగులకు లభించింది. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇది సాధారణ వైద్య విధానంగా మారింది. 1972లో మొదటిసారిగా శస్త్రచికిత్సకు ముందు రెండో అభిప్రాయం తీసుకునే ప్రత్యేక కార్యక్రమం ప్రారంభమైంది. వేలాది మంది రోగులు అందులో పాల్గొన్నారు. ఆశ్చర్యకరంగా దాదాపు 28 శాతం మంది మొదట సూచించిన చికిత్సను తిరస్కరించి మరో మార్గాన్ని ఎంచుకున్నారు. ఈ ఫలితాలతో రెండో అభిప్రాయం ప్రాముఖ్యత మరింత పెరిగింది. ప్రస్తుతం చాలా ఆరోగ్య బీమా పథకాలు కూడా ఈ సేవకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయి.

### • ఎప్పుడు తప్పనిసరిగా తీసుకోవాలి?

రెండో అభిప్రాయం తీసుకున్న తర్వాత కొంతమందిలో వ్యాధి నిర్ధారణే మారిపోతుంది. ముఖ్యంగా క్యాన్సర్, బయాప్సీ నివేదికలు, స్కాన్ ఫలితాల విషయంలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉంటాయి. కొన్ని పరిశోధనల ప్రకారం క్యాన్సర్ రోగుల్లో 42 శాతం వరకు చికిత్స విధానంలో మార్పులు చోటుచేసుకున్నాయి. కొన్నిసార్లు శస్త్రచికిత్స అవసరం లేదని కూడా తేలుతుంది. మరోవైపు సాధారణ వ్యాధుల విషయంలో కొత్త నిర్ధారణ తక్కువగా వచ్చినా రోగులకు ఉపయోగపడే సూచనలు ఎక్కువగా లభిస్తున్నాయి. అరుదైన వ్యాధి ఉన్నప్పుడు, క్లిష్టమైన శస్త్రచికిత్స సూచించినప్పుడు, తీవ్రమైన దుష్ప్రభావాలు వచ్చే అవకాశం ఉన్నప్పుడు, జీవితాంతం ప్రభావం చూపే చికిత్స అవసరమైనప్పుడు రెండో అభిప్రాయం తీసుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వైద్యుడు చెప్పిన విషయాలు పూర్తిగా అర్థం కాకపోయినా, సందేహాలు మిగిలినా మరో నిపుణుడిని సంప్రదించడం ప్రయోజనకరం.

### • డాక్టర్‌తో స్పష్టంగా మాట్లాడండి

రెండో అభిప్రాయం కోరడం వల్ల వైద్యుడు బాధపడతారని చాలామంది భావిస్తారు. వాస్తవానికి మంచి వైద్యులు రోగి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరుకుంటారు. అందుకే మీ సందేహాలను నేరుగా చెప్పడం మంచిది. అవసరమైన పరీక్షల నివేదికలు, స్కాన్‌లు, మందుల వివరాలు తీసుకెళితే మరో వైద్యుడు త్వరగా సరైన అభిప్రాయం చెప్పగలుగుతారు. ఆస్పత్రికి వెళ్లే ముందు మీకు ఉన్న అన్ని ప్రశ్నలను రాసుకోవాలి. కుటుంబ సభ్యుడిని వెంట తీసుకెళ్లడం కూడా ఉపయోగకరం. మీ సమస్య ఎంతకాలంగా ఉందో, ఇప్పటి వరకు తీసుకున్న చికిత్స ఏమిటో వివరంగా చెప్పాలి. అలాగే ఆ వైద్యుడికి ఆ వ్యాధి చికిత్సలో ఎంత అనుభవం ఉందో కూడా అడగొచ్చు. అవసరమైతే పుస్తకాలు, పరిశోధన వివరాలు, నమ్మదగిన వెబ్‌సైట్ల సమాచారం ఇవ్వమని కోరాలి.

### • ఆరోగ్యంపై నిర్ణయం మీదే

ప్రతి వ్యాధికి ఒకే విధమైన అత్యవసర పరిస్థితి ఉండదు. కొన్ని శస్త్రచికిత్సలు వెంటనే చేయాల్సి ఉంటుంది. మరికొన్నింటికి కొన్ని రోజులు లేదా వారాల సమయం ఉంటుంది. అందుకే రెండో అభిప్రాయం తీసుకునే ముందు చికిత్స ఎంత అత్యవసరమో వైద్యుడిని అడగాలి. దీంతో అవసరమైన చికిత్స ఆలస్యం కాకుండా సరైన నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యానికి సంబంధించిన ప్రతి నిర్ణయం జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. అందుకే ఒక వైద్యుడి అభిప్రాయం వినడం ఎంత ముఖ్యమో, అవసరమైతే మరో నిపుణుడి సలహా తీసుకోవడం కూడా అంతే అవసరం. రెండో అభిప్రాయం అనేది వైద్యుడిపై అపనమ్మకం కాదు. అది రోగికి మరింత అవగాహన, నమ్మకం, భద్రత కలిగించే ప్రక్రియ. సరైన సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయం మంచి చికిత్సకు, మెరుగైన ఆరోగ్యానికి బలమైన పునాది అవుతుంది.

### • నమ్మకం పెంచేదే మంచి వైద్యం

ఆరోగ్య సేవల్లో విశ్వాసం అత్యంత విలువైన ఔషధం. రోగి సందేహాలను నివృత్తి చేయడం, చికిత్సకు ఉన్న ప్రత్యామ్నాయాలను వివరించడం, నిర్ణయం తీసుకునేందుకు తగిన సమయం ఇవ్వడం ప్రతి వైద్యుడి బాధ్యత. రెండో అభిప్రాయం కోరిన రోగిని అనుమానంతో చూడకుండా, అవసరమైన వైద్య రికార్డులు అందించి సహకరించడం ఆరోగ్యకరమైన వైద్య వ్యవస్థకు సంకేతం. మరోవైపు సామాన్యులు ఇంటర్నెట్‌లో కనిపించే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా అర్హత కలిగిన నిపుణుల సలహానే తీసుకోవాలి. సోషల్ మీడియాలో వచ్చే అపోహల ఆధారంగా చికిత్సను మధ్యలో నిలిపివేయడం, స్వయంగా మందులు వాడడం ప్రమాదకరం. కుటుంబ సభ్యులు కూడా రోగిపై ఒత్తిడి తీసుకురాకుండా ప్రశాంతంగా నిర్ణయం తీసుకునేలా అండగా నిలవాలి. వైద్యుడి అనుభవం, ఆస్పత్రి సౌకర్యాలు, చికిత్స ఫలితాలపై స్పష్టమైన సమాచారం తెలుసుకున్న తర్వాత తీసుకునే నిర్ణయమే ఉత్తమం. రోగి విశ్వాసం, వైద్యుడి పారదర్శకత, కుటుంబ సభ్యుల సహకారం కలిసొస్తేనే మెరుగైన చికిత్సతో పాటు మెరుగైన జీవన నాణ్యత సాధ్యమవుతుంది.



## వైద్యంలో సెకండ్ ఒపీనియన్ - అవసరమేనా?

వైద్య రంగంలో "సెకండ్ ఒపీనియన్" అనేది వైద్యుడిపై అవిశ్వాసానికి సూచిక కాదు. ఇది రోగి తన ఆరోగ్యానికి సంబంధించిన కీలక నిర్ణయాలను మరింత అవగాహనతో తీసుకునేందుకు ఉపయోగపడే ఒక సముచితమైన ప్రక్రియ. ముఖ్యంగా శస్త్రచికిత్సలు, అవయవ మార్పిడి, దీర్ఘకాలిక వ్యాధులు లేదా ఖరీదైన చికిత్సల విషయంలో మరో నిపుణుడి అభిప్రాయం తీసుకోవడం సమంజసమే. నెఫ్రాలజీలో ఇది మరింత ప్రాధాన్యత సంతరించుకుంటుంది. దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, డయాలిసిస్ ప్రారంభించాల్సిన సమయం, కిడ్నీ బయాప్సీ అవసరం, కిడ్నీ మార్పిడి వంటి నిర్ణయాలు రోగి జీవితాన్ని దీర్ఘకాలం ప్రభావితం చేస్తాయి. ఇలాంటి సందర్భాల్లో రెండో అభిప్రాయం రోగిలో విశ్వాసాన్ని పెంచడమే కాకుండా, చికిత్సా విధానంపై స్పష్టతను కూడా అందిస్తుంది. చాలా సందర్భాల్లో ఇద్దరు నిపుణుల అభిప్రాయాలు ఒకేలా ఉండవచ్చు. అప్పుడు రోగికి తన చికిత్స సరైన దిశలో ఉందనే ధైర్యం కలుగుతుంది. అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పుడు, శాస్త్రీయ ఆధారాలతో ఉత్తమమైన మార్గాన్ని ఎంచుకునే అవకాశం లభిస్తుంది. అయితే, ప్రతి చిన్న సమస్యకూ వైద్యులను తరచూ మార్చడం లేదా ఒకే విషయంపై అనేక అభిప్రాయాల కోసం తిరగడం చికిత్సలో ఆలస్యానికి దారితీయవచ్చు. అందువల్ల సెకండ్ ఒపీనియన్‌ను వివేకంతో వినియోగించాలి. వైద్యుడు-రోగి మధ్య పరస్పర విశ్వాసం, పారదర్శక సంభాషణ, శాస్త్రీయ దృక్పథం కలిసి ఉంటేనే ఉత్తమ వైద్య ఫలితాలు సాధ్యమవుతాయి.

- కళాశికం క్రాంతి కుమార్
ఎండీ. డీఎం, సీనియర్ కన్సల్టెంట్
ఏఐఎన్‌యూ, హైటెక్ సిటీ, హైదరాబాద్



# ముహూర్తం రెడీ..

## వారం మొత్తం హడావుడి

- శుభకార్యాలకు గ్రీన్ సిగ్నల్
- వచ్చే 10 రోజుల్లో 7 రోజులు భేష్
- మళ్ళీ శ్రావణ మాసం దాకా ఆగాల్సిందే..

దాదాపు నెల రోజులుగా శుభకార్యాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలకు ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. అధిక జ్యేష్టమాసం ముగియడంతో నిజ జ్యేష్టమాసంలో వరుసగా బలమైన ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. జూన్ 27 నుంచి జూలై 9 వరకు ఉన్న శుభదినాల్లో రాష్ట్రవ్యాప్తంగా వేలాది వివాహాలు, గృహప్రవేశాలు, కొత్త వ్యాపారాల ప్రారంభాలు జరగనున్నాయి. దీంతో కల్యాణ మండపాలు, కేటరింగ్ సంస్థలు, పూల వ్యాపారులు, బంగారం దుకాణాలు, వస్త్ర షోరూమ్‌లు, ఫొటోగ్రాఫర్లు, పురోహితులు సహా అనుబంధ రంగాలన్నీ మళ్లీ కళకళలాడుతున్నాయి. పెళ్లి ఏర్పాట్ల కోసం కుటుంబాలు ఇప్పటికే షాపింగ్ ప్రారంభించగా, బంగారం దుకాణాల్లో ఆర్డర్లు పెరుగుతున్నాయి. నెల రోజులుగా పనులు లేక ఇబ్బంది పడిన వేలాది మంది కార్మికులకు కూడా ఈ ముహూర్తాలు ఉపాధి కల్పించనున్నాయి. ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఈ శుభవేళలు కొత్త ఊపును తీసుకురానున్నాయని వ్యాపార వర్గాలు, జ్యోతిష్య పండితులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు నెల రోజులుగా శుభకార్యాలకు బ్రేక్ పడింది. అధిక జ్యేష్టమాసం కారణంగా వివాహాలు, గృహప్రవేశాలు, కొత్త వ్యాపారాల ప్రారంభాలు వాయిదా పడ్డాయి. ఇప్పుడు ఆ నిరీక్షణకు తెరపడింది. నిజ జ్యేష్టమాసం ప్రారంభంతో వరుసగా ఏడు రోజుల పాటు అత్యంత శక్తివంతమైన ముహూర్తాలు అందుబాటులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా శుభకార్యాల సందడి మొదలైంది. పెళ్లి మండపాల నుంచి బంగారం దుకాణాల వరకు ప్రతి చోటా కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

### • ఈ తేదీలే అత్యంత శుభప్రదం

జ్యోతిష్య పండితుల ప్రకారం జూలై 1, 2, 3, 4, 5, 8, 9 తేదీల్లో అత్యంత బలమైన ముహూర్తాలు ఉన్నాయి. ఈ రోజుల్లో వివాహాలు, గృహప్రవేశాలు, నూతన వ్యాపారాలు, వాహనాల కొనుగోళ్లు, ఇతర శుభకార్యాలు నిర్వహించేందుకు అనుకూల సమయాలు ఉన్నాయని చెబుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా మంచి ముహూర్తాలు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. ముహూర్తాలు లేక నెలరోజులుగా మందగించిన అనుబంధ వ్యాపారాలు ఇప్పుడు మళ్లీ జోరందుకోనున్నాయి. కల్యాణ మండపాలు, కేటరింగ్ సంస్థలు, టెంట్ హౌస్‌లు, డెకరేషన్ నిర్వాహకులు, పూల వ్యాపారులు, పురోహితులు, ఫొటోగ్రాఫర్లు, వస్త్ర దుకాణాలు, బంగారం షాపులు వరుస బుకింగ్‌లతో బిజీగా మారుతున్నాయి. ఉపాధి కోసం ఎదురుచూసిన వేలాది మంది కార్మికులకు కూడా ఇప్పుడు పనులు లభించే పరిస్థితి ఏర్పడింది.

### • రెండు రాష్ట్రాల్లో పెళ్లిళ్ల సందడి

నెల రోజుల విరామం తర్వాత ముహూర్తాలు రావడంతో జిల్లాల వ్యాప్తంగా భారీ సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి. ఒక్కో జిల్లాలోనే వందల సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉందని అంచనా. మొత్తం మీద సుమారు రెండు వేల వరకు వివాహాలు జరిగే అవకాశముందని నిర్వాహకులు భావిస్తున్నారు. దీంతో వస్త్ర దుకాణాలు, పట్టుచీరల షోరూమ్‌లు, కిరాణా దుకాణాలు, గిఫ్ట్ సెంటర్లు వినియోగదారులతో కిక్కిరిసిపోతున్నాయి. పెళ్లి అంటే తాళిబొట్టు, ఆభరణాలు తప్పనిసరి. బంగారం ధరలు రోజురోజుకూ పెరుగుతున్నా కొనుగోళ్లలో మాత్రం తగ్గుదల కనిపించడం లేదు. చాలామంది ముందుగానే ఆభరణాలకు ఆర్డర్లు ఇస్తుండగా, మరికొందరు బంగారం కొనుగోలు చేసి తమకు నచ్చిన నమూనాల్లో తయారు చేయిస్తున్నారు. దీంతో నగల దుకాణాల్లో పనిభారం గణనీయంగా పెరిగింది.

### • ముందస్తు బుకింగ్‌ల జోష్

జ్యేష్టమాసం హిందూ సంప్రదాయంలో అత్యంత విశిష్టమైన మాసంగా భావిస్తారు. ఈ మాసం బ్రహ్మదేవునికి ప్రీతికరమైనదిగా పురాణాలు చెబుతున్నాయి. నిజ జ్యేష్టమాసంలో వివాహాలు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాలను ఎలాంటి సందేహం లేకుండా నిర్వహించవచ్చని జ్యోతిష్య పండితులు సూచిస్తున్నారు. అందుకే అనేక కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకునేందుకు సిద్ధమవుతున్నాయి. పురోహితుల వద్ద కూడా రద్దీ పెరిగింది. వివాహాలు, గృహప్రవేశాలు నిర్వహించుకునే కుటుంబాలు ముందుగానే తేదీలు ఖరారు చేసుకుని బుకింగ్‌లు చేస్తున్నారు. నెల రోజులుగా పనులు లేక ఖాళీగా ఉన్న పురోహితులకు ఇప్పుడు వరుసగా కార్యక్రమాలు రావడంతో సంతోషం వ్యక్తమవుతోంది.

### • మళ్లీ మోగనున్న మంగళవాయిద్యాలు

శుభ ముహూర్తాలు అనేవి కేవలం పంచాంగంలో కనిపించే తేదీలు మాత్రమే కాదు.. ఎన్నో కుటుంబాల కలలు నిజమయ్యే అరుదైన సందర్భాలు. ఒక పెళ్లి వెనుక వందలాది మంది ఉపాధి, అనేక వ్యాపారాల ఆదాయం, కుటుంబాల ఆనందం దాగి ఉంటుంది. నెల రోజుల నిశ్శబ్దం తర్వాత మళ్లీ మంగళవాయిద్యాలు మోగబోతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. కల్యాణ మండపాల నుంచి బంగారం దుకాణాల వరకు, పట్టుచీరల షోరూమ్‌ల నుంచి పూల మార్కెట్ల వరకు ప్రతి రంగంలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. శుభ ముహూర్తాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే చాలా కుటుంబాలు ఏర్పాట్లు వేగవంతం చేశాయి. ముందస్తు బుకింగ్‌లతో పురోహితులు, కేటరింగ్ నిర్వాహకులు, ఫొటోగ్రాఫర్లు కూడా పూర్తిగా బిజీ అవుతున్నారు. రానున్న రోజుల్లో వివాహాలు, గృహప్రవేశాలు, కొత్త వ్యాపారాల ప్రారంభాలతో రెండు తెలుగు రాష్ట్రాలు శుభకార్యాల సందడితో కళకళలాడనున్నాయి. ఆధ్యాత్మిక విశ్వాసానికి, ఆర్థిక చైతన్యానికి ఈ శుభవేళలు మరోసారి బలమైన నిదర్శనంగా నిలవనున్నాయి. ఈ ఏడు రోజుల శుభ ముహూర్తాలు వేలాది కుటుంబాల్లో కొత్త జీవితాలకు నాంది పలుకుతూ, లక్షలాది మందికి ఉపాధి కల్పించే స్వర్ణావకాశంగా మారనున్నాయి.



ప్రస్తుతం కొనసాగుతున్న నిజ జ్యేష్ట మాసం ఉత్తరాయణంలో చివరి మాసమని, ఈ కాలానికి ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉందని జ్యోతిష్య విద్వాంసులు పులిపాక చంద్రశేఖర శర్మ తెలిపారు. ఉత్తరాయణంలో దేవతల అనుగ్రహం అధికంగా ఉంటుందని, వైకుంఠనాథుడి కటాక్షం లభించే పవిత్ర కాలంగా శాస్త్రాలు పేర్కొంటాయని చెప్పారు. అందుకే ఈ మాసంలో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు నిర్వహించడం సుకృతప్రదమని వివరించారు. ఇదే సమయంలో రాజకీయ పరంగా కూడా కొన్ని కీలక పరిణామాలకు అనుకూలమైన ముహూర్తాలు ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో మంత్రివర్గ విస్తరణతో పాటు కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో కూడా మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అలాంటి నిర్ణయాలకు జ్యోతిష్యపరంగా అనుకూలమైన శుభ ముహూర్తాలు ఈ నిజ జ్యేష్ట మాసంలో ఉన్నాయని చెప్పారు. అయితే జ్యోతిష్య సూచనలు విశ్వాసాల ఆధారంగా ఉంటాయని, ప్రభుత్వ నిర్ణయాలు పూర్తిగా రాజకీయ పరిస్థితులు, పరిపాలనా అవసరాలపై ఆధారపడి ఉంటాయని కూడా ఆయన స్పష్టం చేశారు. దేవతను అనుగ్రహం అధికంగా ఉంటుందని వైకుంఠనాథుడి కటాక్షం లభిస్తుందని 'విష్ణు పురాణం' చెప్తుంది అని సిద్ధాంతి చంద్రశేఖర శర్మ అన్నారు.

- పులిపాక చంద్రశేఖర్ శర్మ సిద్ధాంతి,
శ్రీ చక్ర పంచాంగ కర్త



# సేఫ్ జోన్ నినాదం..
# పొంచి ఉన్న ప్రమాదం..

- తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్న భూకంపం..
- మానవ తప్పిదాలతో తీరని శాపం




**భూకంపం అంటే హిమాలయాలు, జపాన్, నేపాల్ మాత్రమే గుర్తొచ్చే రోజులు మారిపోయాయి. ఇటీవల తెలంగాణలోని ములుగు కేంద్రంగా నమోదైన భూకంపం, హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో అనిపించిన ప్రకంపనలు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆందోళన పెంచాయి. ఒకప్పుడు భూకంపాల ప్రభావం ఉండదని భావించిన హైదరాబాద్‌లో కూడా అప్పుడప్పుడు భూమి కంపించడం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది. భారీ ఎత్తున నిర్మాణాలు, ఆకాశహర్మ్యాలు, విస్తరిస్తున్న నగరాలు భూకంపాలను తట్టుకునే స్థితిలో ఉన్నాయా అనే చర్చ మొదలైంది. మరోవైపు గోదావరి రిఫ్ట్ జోన్, కృష్ణా-గోదావరి బేసిన్, దక్కన్ పీఠభూమిలోని భౌగోళిక మార్పులు శాస్త్రవేత్తల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలు అత్యంత ప్రమాదకర భూకంప మండలాల్లో లేకపోయినా, పూర్తిగా భద్రమని చెప్పే పరిస్థితి లేదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భూకంపాల నేపథ్యంలో హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎంతవరకు సురక్షితం? భవిష్యత్తులో ఎలాంటి ముప్పు ఉండొచ్చు? ప్రజలు, ప్రభుత్వాలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమిటి? అనే అంశాలపై ఇప్పుడు చర్చ అవసరమైంది.**

- భూమి కంపిస్తే ఏం జరుగుతుంది?
- తెలుగు రాష్ట్రాలు ఎంత భద్రం?
- ప్రపంచాన్ని భయపెడుతున్న భూకంపాలు

ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా వరుస భూకంపాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వెనిజువెలా, మయన్మార్, జపాన్, నేపాల్, ఆఫ్ఘనిస్తాన్, థాయ్‌లాండ్ వంటి దేశాల్లో భారీ ప్రకంపనలు ప్రాణనష్టం, ఆస్తి నష్టాన్ని మిగిల్చాయి. ఒక్కోసారి వేల కిలోమీటర్ల దూరంలో సంభవించిన భూకంపాల ప్రభావం పొరుగు దేశాల వరకు కనిపిస్తోంది. దీంతో భారత్ పరిస్థితి ఏమిటి? ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు ఎంత వరకు సురక్షితంగా ఉన్నాయి? అనే ప్రశ్న సహజంగానే వినిపిస్తోంది. భూకంపాన్ని ముందుగానే కచ్చితంగా అంచనా వేయడం ఇప్పటికీ సాధ్యం కాకపోయినా, ప్రమాదం ఎక్కువగా ఉండే ప్రాంతాలను శాస్త్రవేత్తలు ఇప్పటికే గుర్తించారు.

### భారత్ ఎందుకు ప్రభావితమవుతోంది?

భారత్ ఉన్న భౌగోళిక స్థానం భూకంపాల పరంగా కీలకమైనది. భారత టెక్టానిక్ ప్లేట్ నిరంతరం ఉత్తర దిశగా కదులుతూ ఆసియా ప్లేట్‌ను ఢీకొంటోంది. ఈ ఒత్తిడి కారణంగానే హిమాలయ ప్రాంతం అత్యంత సున్నితమైన భూకంప మండలంగా మారింది. జమ్మూకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఈశాన్య రాష్ట్రాలు తరచూ ప్రకంపనలను ఎదుర్కొంటున్నాయి. నేపాల్, మయన్మార్, పాకిస్థాన్ ప్రాంతాల్లో సంభవించే భూకంపాల ప్రభావం ఉత్తర భారతదేశంలో కొన్నిసార్లు కనిపించడం ఇదే కారణం. గత 150 ఏళ్లలో హిమాలయ ప్రాంతంలో పలు భారీ భూకంపాలు నమోదయ్యాయి. భూమి అడుగున పేరుకుపోతున్న ఒత్తిడి ఒక దశలో విడుదలైతే రిక్టర్ స్కేల్‌పై 8 తీవ్రతకు చేరుకునే భూకంపం వచ్చే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అది ఎప్పుడు వస్తుందో చెప్పడం అసాధ్యం. రేపైనా రావచ్చు. వందేళ్ల తర్వాతైనా రావచ్చు. ఇదే కారణంగా ఉత్తర భారతదేశంలో భూకంప నిరోధక నిర్మాణాలపై కేంద్ర ప్రభుత్వం, నిపుణులు ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

### హైదరాబాద్ కూడా మినహాయింపు కాదా?

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ పూర్తిగా భూకంప రహిత ప్రాంతాలు కావు. 2024 డిసెంబర్‌లో తెలంగాణలోని ములుగు సమీపంలోని మేడారం అటవీ ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం సహా అనేక ప్రాంతాల్లో ప్రజలు ప్రకంపనలు అనుభవించారు. 1969 తర్వాత ఇదే స్థాయిలో నమోదైన ప్రధాన భూకంపంగా శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అదృష్టవశాత్తూ భూకంప కేంద్రం అటవీ ప్రాంతంలో ఉండటంతో పెద్ద ఎత్తున నష్టం జరగలేదు. గతంలో హైదరాబాద్ భూకంపాల ప్రభావం ఉండని నగరంగా భావించేవారు. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. చిన్న స్థాయి ప్రకంపనలు అప్పుడప్పుడు నమోదవుతున్నాయి. నగరంలో వేగంగా పెరుగుతున్న ఎత్తైన భవనాలు కొత్త చర్చకు దారితీస్తున్నాయి. 40 నుంచి 50 అంతస్తుల భవనాలు నిర్మిస్తున్న సమయంలో భూకంప నిరోధక ప్రమాణాలు ఎంతవరకు పాటిస్తున్నారనే అంశంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### భూకంపమే కాదు.. ప్రకృతి హెచ్చరికలు కూడా

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి కాలంలో ప్రకృతి విపత్తులు పెరుగుతున్నాయి. ములుగు జిల్లాలో క్లౌడ్ బరస్ట్, విజయవాడ వరదలు, ఖమ్మం జలవిలయం, అసాధారణ వర్షాలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇవన్నీ భూకంపాలకు నేరుగా సంబంధం లేకపోయినా ప్రకృతి సమతుల్యత దెబ్బతింటోందనే సంకేతాలను ఇస్తున్నాయని పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. వాగులు, వంకలు, చెరువులు, నదుల పరీవాహక ప్రాంతాలను ఆక్రమించడం, కొండలను తవ్వడం, అడవులను నరికివేయడం, నియంత్రణ లేకుండా పట్టణాలను విస్తరించడం వల్ల ప్రకృతి విపత్తుల ప్రభావం మరింత పెరుగుతోంది. విజయవాడలో బుడమేరు, ఖమ్మంలో మున్నేరు ఆక్రమణలు వరదల తీవ్రతను పెంచిన ఉదాహరణలుగా నిపుణులు చెబుతున్నారు. ప్రకృతి విపత్తును పూర్తిగా ఆపలేకపోయినా నష్టాన్ని మాత్రం తగ్గించవచ్చని సూచిస్తున్నారు.

### ప్రభుత్వాలు చేయాల్సింది ఇదే

భూకంపాల ముప్పును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వాలు భూకంప ప్రమాద మ్యాపింగ్‌ను నవీకరించాలి. కొత్త భవనాలకు భూకంప నిరోధక ప్రమాణాలు తప్పనిసరి చేయాలి. పాత ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రుల నిర్మాణ బలాన్ని పరీక్షించాలి. జిల్లా స్థాయిలో అత్యవసర సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలి. ప్రజలకు తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి అవగాహన కల్పించాలి. భూకంపం వచ్చినప్పుడు లిఫ్ట్ ఉపయోగించకూడదు. భవనం బలంగా కదిలితే వెంటనే బహిరంగ ప్రదేశానికి వెళ్లాలి. భారీ అల్మారాలు, గాజు వస్తువులు గోడలకు బిగించి ఉంచాలి. ఇంట్లో అత్యవసర కిట్ సిద్ధంగా ఉంచుకోవాలి. అధికారిక హెచ్చరికలను మాత్రమే నమ్మాలి. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మి భయపడకూడదు.

### భవిష్యత్తు కోసం ఇప్పుడే సిద్ధం కావాలి

తెలుగు రాష్ట్రాలు ప్రస్తుతం అత్యంత ప్రమాదకర భూకంప మండలాల్లో లేకపోయినా పూర్తిగా సురక్షితమని చెప్పే పరిస్థితి లేదు. ప్రకృతి ఇచ్చే హెచ్చరికలను తేలికగా తీసుకోవడం ప్రమాదకరం. భూకంపాన్ని ఆపే శక్తి మనిషికి లేదు. నష్టాన్ని తగ్గించే శక్తి మాత్రం ఉంది. శాస్త్రీయ ప్రమాణాలతో నిర్మాణాలు చేపట్టడం, ప్రకృతిని పరిరక్షించడం, ప్రజల్లో అవగాహన పెంచడం, విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్తు ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. భూమి ఎప్పుడు కంపిస్తుందో మన చేతుల్లో లేదు. కానీ భూమి కంపించినప్పుడు ఎంత సురక్షితంగా ఉండాలో నిర్ణయించేది మాత్రం మనమే.

# రామాలయంలో రాబందులు



## సిట్ విచారణతో వెలుగులోకి
## సంచలన ఆరోపణలు

- **దర్యాప్తులో మలుపు.. వివాదం ఎలా బయటకొచ్చింది?**

అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసింది. భక్తులు సమర్పించిన నగదు, విలువైన వస్తువులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. జూన్ 7న సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ రామమందిర విరాళాల్లో కోట్ల రూపాయలు కనిపించడం లేదని ఆరోపించడంతో ఈ అంశం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది.

**సిట్ ఏర్పాటు... ఎఫ్ఐఆర్‌లో ఏముంది?**

ఆరోపణలు తీవ్రరూపం దాల్చడంతో జూన్ 13న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక దర్యాప్తు బృందం...సిట్‌ను ఏర్పాటు చేసింది. ఈ బృందం విరాళాల లెక్కలు, నగదు నిర్వహణ, భద్రతా వ్యవస్థపై సమగ్ర విచారణ ప్రారంభించింది. దర్యాప్తులో భాగంగా ఆలయ సిబ్బంది, నగదు లెక్కింపు కేంద్రంలో పనిచేసే ఉద్యోగులను ప్రశ్నించింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న ఆరోపణల ప్రకారం కొందరు ఆలయ సిబ్బంది, నగదు లెక్కింపు కేంద్రంలో పనిచేసే ఉద్యోగులు కలిసి పథకం ప్రకారం విరాళాల నగదును అక్రమంగా మళ్లించినట్లు ఆరోపించారు. హుండీల నుంచి వచ్చిన నగదు లెక్కింపు, వర్గీకరణ సమయంలో కొంత మొత్తాన్ని దాచిపెట్టినట్లు దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి. నగదుతో పాటు ఆలయానికి సమర్పించిన విలువైన వస్తువులను కూడా అక్రమంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు నమోదయ్యాయి.

**దర్యాప్తులో కీలక పరిణామాలు**

ఈ కేసులో ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు అయ్యాయి. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నగదు లావాదేవీలు, సీసీటీవీ దృశ్యాలు, ఇతర సాంకేతిక ఆధారాలను పరిశీలిస్తూ ఎస్ఐటీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఆలయ విరాళాల నిర్వహణలో లోపాలు జరిగాయా అనే అంశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. ఈ వ్యవహారంపై రాజకీయ విమర్శలు కూడా తీవ్రంగా కొనసాగుతున్నాయి. అయితే ఇప్పటివరకు నమోదైనవి ఆరోపణలు మాత్రమే. వాటి నిజానిజాలు ఎస్ఐటీ దర్యాప్తు, న్యాయ ప్రక్రియ పూర్తయిన తర్వాతే స్పష్టమవుతాయి. దర్యాప్తులో ఎవరి ప్రమేయం ఉన్నా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నారు. కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి సంబంధించిన అంశం కావడంతో ఈ కేసుపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



## రామమందిర విరాళాల వివాదం

**ట్రస్ట్‌లో రాజీనామాల కలకలం**

**ముదురుతోన్న విరాళాల వివాదం**

అయోధ్యలోని రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు కొత్త మలుపు తిరిగాయి. ఈ వ్యవహారంలో శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. విరాళాల అక్రమాలపై నమోదైన కేసు, ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నివేదిక నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సిట్ దర్యాప్తుతో కేసు నమోదు**

ట్రస్ట్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం చంపత్ రాయ్, అనిల్ మిశ్రా రాజీనామాలు అధికారికంగా అందాయి. అయితే వాటిని ఆమోదించాలా లేదా అన్న అంశంపై ట్రస్ట్ తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకోనుంది. చంపత్ రాయ్ తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యత స్వీకరిస్తూ రాజీనామా చేసినట్లు వెల్లడించారు. విరాళాల లెక్కల్లో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం జూన్ 13న ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. సిట్ ప్రాథమిక నివేదిక ఆధారంగా ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు. మరో కొందరిపై కూడా విచారణ కొనసాగుతోంది. నిందితులను అరెస్ట్ చేసి జూన్ 29 వరకు న్యాయస్థాన కస్టడీకి పంపించారు.

**సిట్ నివేదికలో కీలక అంశాలు**

నిందితులపై చోరీ, నమ్మకద్రోహం, దొంగిలించిన ఆస్తిని దాచిపెట్టడం, నేర కుట్ర, ఉమ్మడి ఉద్దేశంతో నేరానికి పాల్పడటం వంటి పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. విరాళాల అసలు మొత్తం ఎంత దుర్వినియోగమైందన్న అంశంపై దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటివరకు పూర్తి వివరాలు బయటకు రాలేదు. సిట్ ప్రాథమిక నివేదికలో విరాళాల లెక్కింపు ప్రక్రియలో అనేక నిబంధనలు పాటించలేదని వెల్లడైనట్లు సమాచారం. లెక్కింపు సమయంలో భద్రతా సిబ్బంది నియామకం, సిబ్బందిని తనిఖీ చేయడం, సీసీటీవీ దృశ్యాలను 180 రోజుల పాటు భద్రపరచడం వంటి ప్రమాణాలు అమలు కాలేదని గుర్తించినట్లు తెలుస్తోంది. ఈ నిబంధనలను 2025లోనే ట్రస్ట్ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు కలిసి రూపొందించినట్లు సమాచారం.

**రాజకీయంగా వేడెక్కిన వివాదం**

ఈ ఘటన ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ప్రతిపక్షాలు ఎఫ్ఐఆర్‌లో ఉన్నత స్థాయి బాధ్యులపై చర్యలు లేకపోవడాన్ని ప్రశ్నిస్తున్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ప్రజల విశ్వాసంతో ఎవరైనా చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పూర్తి దర్యాప్తు అనంతరం అసలు బాధ్యులపై మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పాత్రధారులెవరు?

- **సూత్రధారులెవరు... తెలాల్సిందే**
- **భక్తుల మనోభావాలతో ఆటలా?**
- **విరాళాల వ్యవహారంలో పెద్దలెవరు?**
- **ప్రియాంక గాంధీ ఘాటు ప్రశ్నలు**

రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు దేశ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ఘాటుగా స్పందించారు. ఈ ఘటన కోట్లాది మంది భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీసిందని ఆమె అన్నారు. రాముడి పేరుతో వచ్చిన విరాళాల విషయంలో అక్రమాలు జరిగి ఉంటే అది అత్యంత ఘోరమైన పాపమని వ్యాఖ్యానించారు.

**చిన్న ఉద్యోగులే చేశారా? భక్తుల విశ్వాసమే దెబ్బతింది**

ఆలయ హుండీలో వచ్చిన విరాళాలు దుర్వినియోగం అయ్యాయన్న ఆరోపణలు ప్రజలను కలవరానికి గురిచేశాయని ప్రియాంక పేర్కొన్నారు. ఇది కేవలం ఆర్థిక నష్టం కాదని, కోట్లాది మంది భక్తుల నమ్మకంపై దెబ్బ అని చెప్పారు. మతం, విశ్వాసం ప్రతిబింబించే ఆలయంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో కేవలం కింది స్థాయి ఉద్యోగులే బాధ్యులని చెప్పడం నమ్మశక్యం కాదని ప్రియాంక ప్రశ్నించారు. సీసీటీవీ కెమెరాలను నిలిపివేయడం, భారీ మొత్తంలో విరాళాల లెక్కల్లో మార్పులు చేయడం వంటి చర్యలు పెద్దల ప్రమేయం లేకుండా సాధ్యమా అని ఆమె సందేహం వ్యక్తం చేశారు. ఈ ఘటన వెనుక ప్రభావశీలుల పాత్ర ఉందా అనే కోణంలో కూడా దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు.

**నైతిక బాధ్యతతో రాజీనామాలు... పారదర్శక దర్యాప్తు జరగాలి**

ఈ కేసు విచారణ పూర్తిగా పారదర్శకంగా సాగాలని ప్రియాంక గాంధీ కోరారు. ఎవరినీ కాపాడే ప్రయత్నం చేయకుండా నిజాలు వెలికితీయాలని చెప్పారు. దర్యాప్తులో ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే వారి హోదా ఏమిటన్నది చూడకుండా చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వివాదం నేపథ్యంలో రామ జన్మభూమి ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్టీ అనిల్ మిశ్రా నైతిక బాధ్యత స్వీకరిస్తూ తమ పదవులకు రాజీనామా చేశారు. ఇప్పటికే ఈ కేసులో పలువురిని అరెస్టు చేసిన దర్యాప్తు సంస్థలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విరాళాల లెక్కింపు కేంద్రంతో సంబంధాలపై కూడా విచారణ కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో తుది నిజాలు దర్యాప్తు పూర్తయ్యాకే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# మాట రాని మౌనమిది

- **లడ్డు కల్తీపై రాద్ధాంతం.. హుండీ చోరీపై వేదాంతం..**
- **బాబు, పవన్‌లపై ఆర్కే ధ్వజం**

సీపీఐ సీనియర్ నేత రామకృష్ణ ముఖ్యమంత్రి బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు. తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని నెలల తరబడి మాట్లాడిన ఇద్దరు నేతలు, ఇప్పుడు అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఒకే దేశంలో భక్తుల విశ్వాసానికి సంబంధించిన రెండు ఘటనలపై వేర్వేరు ప్రమాణాలు ఎందుకని నిలదీశారు.

**తిరుపతిపై పెద్ద ఎత్తున ప్రచారం.. అయోధ్య ఘటనపై మౌనం ఎందుకు?**

తిరుపతి లడ్డూ వివాదం సమయంలో చంద్రబాబు నాయుడు పలుమార్లు స్పందించారని రామకృష్ణ గుర్తు చేశారు. పవన్ కళ్యాణ్ కూడా సభలు, పార్టీ సమావేశాలు, మీడియా సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారని చెప్పారు. ఉప ముఖ్యమంత్రిగా తిరుమలకు పాదయాత్ర కూడా నిర్వహించి భక్తుల మనోభావాల పరిరక్షణ గురించి మాట్లాడారని గుర్తు చేశారు. అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కేసులు నమోదు చేసి ఎనిమిది మందిని అరెస్టు చేసినా రాష్ట్ర ప్రభుత్వ పెద్దల నుంచి స్పందన రాకపోవడం ఆశ్చర్యంగా ఉందని రామకృష్ణ అన్నారు. రాముడి భక్తుల విరాళాలు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వచ్చినప్పుడు కూడా అదే స్థాయిలో స్పందించాల్సిన బాధ్యత ఉందని స్పష్టం చేశారు.

**పవన్ పాదయాత్ర చేయాలన్న డిమాండ్.. ఎన్డీఏ బంధమే కారణమా?**

సనాతన ధర్మం గురించి తరచూ మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇప్పుడు అమరావతి నుంచి అయోధ్య వరకు పాదయాత్ర చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. తిరుపతి ఘటనపై చూపిన చొరవను అయోధ్య విషయంలో కూడా చూపించాలని కోరారు. భక్తుల విశ్వాసం ఎక్కడ దెబ్బతిన్నా ఒకే విధంగా స్పందించడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని అన్నారు. చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ స్పందించకపోతే ఎన్డీఏ భాగస్వామ్యమే కారణమని ప్రజలు భావించే పరిస్థితి వస్తుందని రామకృష్ణ హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో మౌనం పాటిస్తున్నారనే అనుమానాలు తలెత్తుతున్నాయని వ్యాఖ్యానించారు. నిష్పక్షపాత వైఖరి ఉంటే అయోధ్య ఘటనపై వెంటనే స్పందించాలని సీపీఐ తరపున ఆయన డిమాండ్ చేశారు.



# అరుదైన ఘనత

» చరిత్ర సృష్టించిన బెన్ స్టోక్స్

» టెస్టుల్లో ఆల్‌రౌండర్ రికార్డ్

ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ మరో అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. టెస్టు క్రికెట్‌లో 7,000కు పైగా పరుగులు, 250 వికెట్లు సాధించిన ప్రపంచంలో కేవలం రెండో క్రికెటర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ ఘనత దక్షిణాఫ్రికా దిగ్గజం జాక్వెస్ కలిస్ పేరిట మాత్రమే ఉండగా, ఇప్పుడు స్టోక్స్ కూడా ఆ జాబితాలో చేరాడు. న్యూజిలాండ్‌తో నాటింగ్‌హామ్ వేదికగా జరుగుతున్న మూడో టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు పడగొట్టడంతో ఈ మైలురాయిని అందుకున్నాడు. స్టోక్స్ ఇప్పటివరకు 122 టెస్టులు ఆడి 250 వికెట్లు తీశాడు. బ్యాటింగ్‌లో 7,243 పరుగులు నమోదు చేశాడు. అతని ఖాతాలో 14 సెంచరీలు, 37 అర్ధశతకాలు ఉన్నాయి. ఈ ఘనతతో ఇంగ్లండ్ తరపున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో మాథ్యూ హోగార్డ్‌ను అధిగమించి తొమ్మిదో స్థానానికి చేరుకున్నాడు. మరోవైపు జాక్వెస్ కలిస్ తన కెరీర్‌లో 13,289 పరుగులు, 292 వికెట్లు సాధించి టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా గుర్తింపు పొందాడు. స్టోక్స్ తాజా రికార్డు అతని ఆల్‌రౌండ్ ప్రతిభకు మరో గొప్ప నిదర్శనంగా నిలిచింది.

# ఆడా, మగా కాదు.. ఆటను చూడండి

- మహిళా క్రికెటర్లపై సెక్సిస్ట్ విమర్శలు
- మాజీ కెప్టెన్ సనా మీర్ ఆగ్రహం



పాకిస్థాన్ మహిళల జట్టు ప్రదర్శనపై వస్తున్న సెక్సిస్ట్ వ్యాఖ్యలను ఆ దేశ మాజీ కెప్టెన్ సనా మీర్ తీవ్రంగా ఖండించారు. మహిళల టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు నాలుగు వరుస పరాజయాల తర్వాత నెదర్లాండ్స్‌పై గెలిచి టోర్నీని ముగించింది. జట్టు ఆశించిన స్థాయిలో ఆడలేదన్న విమర్శలు సహజమేనని, కానీ మహిళా క్రికెటర్లను లింగం ఆధారంగా అవమానించడం మాత్రం అంగీకారయోగ్యం కాదని ఆమె స్పష్టం చేశారు. పురుషుల జట్టు ఓడినప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరూ చేయరని ప్రశ్నించారు. మహిళల క్రికెట్‌పై సమాజంలో ఇంకా సరైన గౌరవం పెరగలేదని సనా మీర్ ఆవేదన వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో అమ్మాయిలు క్రికెట్‌ను వృత్తిగా ఎంచుకోవడానికే ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు. జట్టులో స్థానాల కోసం పోటీ పెరగాలంటే దేశీయ టోర్నీలు ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో కృత్రిమ మేధతో రూపొందించిన తప్పుడు వీడియోలు ప్రచారం చేసి మహిళా ఆటగాళ్లను ఎగతాళి చేయడం వారి కుటుంబాలకు తీవ్ర వేదన కలిగిస్తోందని అన్నారు. మహిళల ఆటను క్రికెట్ ప్రమాణాలతోనే అంచనా వేయాలని, లింగ వివక్షతో కూడిన దూషణలకు సమాజం స్వస్తి పలకాలని సనా మీర్ పిలుపునిచ్చారు.




# 13 సిక్సర్ల సవాల్.. 10తోనే సంచలనం

## వైభవ్ ఆత్మవిశ్వాసం... సంగక్కర వ్యాఖ్యలు

కేవలం 15 ఏళ్ల వయసులోనే భారత యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ తన అసాధారణ ఆత్మవిశ్వాసంతో అందరినీ ఆకట్టుకుంటున్నాడు. ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరపున అద్భుత ప్రదర్శన చేసిన ఈ యువ సంచలనం గురించి ప్రధాన కోచ్ కుమార సంగక్కర ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌కు ముందు వైభవ్ డ్రెస్సింగ్ రూమ్‌లో సహచరులతో "ఈరోజు 13 సిక్సర్లు కొడతా" అని ధీమాగా చెప్పాడని సంగక్కర తెలిపాడు. 221 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే ముందు కోచ్‌కు "టెన్షన్ వద్దు.. మ్యాచ్ మనదే" అని చెప్పిన వైభవ్, మైదానంలో అదే ఆత్మవిశ్వాసాన్ని ప్రదర్శించాడు. 48 బంతుల్లో 93 పరుగులు చేసి ఏకంగా 10 భారీ సిక్సర్లు బాదాడు. అతడి దూకుడుతో రాజస్థాన్ రాయల్స్ ఏడు వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది.



# 12 ఏళ్ల నిరీక్షణకు తెర

## విండీస్‌కు సెమీస్ షాక్ • ఐర్లాండ్ చారిత్రక విజయం

మహిళల టీ20 ప్రపంచకప్‌లో ఐర్లాండ్ జట్టు చరిత్ర సృష్టించింది. గత 12 ఏళ్లుగా ప్రపంచకప్‌లో ఒక్క విజయమూ నమోదు చేయలేకపోయిన ఐరిష్ జట్టు చివరకు ఆ నిరీక్షణకు తెరదించింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌పై ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి 021 పరాజయాల వరుసను ముగించింది. ఈ ఫలితంతో ఐర్లాండ్ ఆటగాళ్లు ఆనందంలో మునిగిపోయారు. ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 128 పరుగులు చేసింది. కెప్టెన్ హేలీ మాథ్యూస్ 22, డియాండ్రా డాటిన్ 21 పరుగులు చేయగా, చివర్లో చినెల్ హెన్రీ అజేయంగా 27 పరుగులతో జట్టును గౌరవప్రదమైన స్కోరుకు చేర్చింది. ఐర్లాండ్ బౌలర్లు కారా ముర్రే, ఐమీ మగ్వైర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రత్యర్థిని నిలువరించారు. 129 పరుగుల లక్ష్యాన్ని ఐర్లాండ్ 18.1 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి చేరుకుంది. ఓర్లా ప్రెండర్‌గ్యాస్ట్ 44 బంతుల్లో 63 పరుగులతో మ్యాచ్ విజయంలో కీలక పాత్ర పోషించింది. చివర్లో రెబెక్కా స్టోకెల్, లూయిస్ లిటిల్ విజయాన్ని ఖాయం చేశారు. ఈ ఓటమితో వెస్టిండీస్ సెమీఫైనల్ అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. డిఫెండింగ్ ఛాంపియన్ న్యూజిలాండ్‌కు మాత్రం ఈ ఫలితం ఊరటనిచ్చింది.




# ఇడుపు కాయితం మూవీ టైటిల్‌పై రచ్చ

## టైటిల్ మార్చేది లేదన్న దర్శకుడు బన్నీవాసు

ఒక సినిమా విడుదలైన తర్వాత అందులోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలపై చర్చ.. వివాదాలకు దారి తీయడం ఇప్పటివరకూ చూశాం. ఇటీవల కాలంలో టైటిల్‌తోనే చర్చకు దారితీసిన మూవీ 'ఇడుపు కాయితం'. సోషల్ మీడియాలో పనిగట్టుకుని కొందరు పెట్టిన పోస్టులు వివాదానికి దారితీశాయి. సినిమా భాష, యాస, టైటిల్స్ విషయంలో రెండు వర్గాలుగా విడిపోయి.. ఒకరిపై ఒకరు ఆరోపణలు, విమర్శలకు దిగారు. ఈ క్రమంలో చిత్ర నిర్మాత బన్ని వాస్ స్పందించారు. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదని, కథను బట్టే టైటిల్ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం వివాదం నేపథ్యంలో టైటిల్, కథను మార్చే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఏ సినిమాకైనా కథ, దాని నేపథ్యం బట్టే టైటిల్ ఉంటుంది. దీనిపై ఇక చర్చ అనవసరం. షూటింగ్ పూర్తయి విడుదలైన తర్వాత సినిమానే మాట్లాడుతుంది. ప్రస్తుతం ఈ వివాదం వల్ల సినిమాకు కొంత ఇబ్బంది కలిగిన మాట వాస్తవం. రేపు సినిమా బాగుంటే అన్నీ సర్దుకుంటాయి. ఇది ఒక ప్రాంతానికి పరిమితమయ్యే కథ కాదు. నాకు పూర్తి నమ్మకం ఉంది.

# ఇరుముడి కట్టు పాట 29న విడుదల

మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా టాలెంటెడ్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న డివోషనల్ డ్రామా 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్, టి 'సిరీస్ సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. ఈ సినిమా నుంచి మొదటి పాట 'ఇరుముడి కట్టు' పాటను జూన్ 29వ తేదీన ఉదయం 11:07 గంటలకు విడుదల చేయబోతున్నట్లు ప్రకటించింది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని ఈ ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, సాయి కుమార్, బేబీ నక్షత్ర, విష్ణుశర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.






## తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం

# నటుడు, దర్శకుడు భాగ్యరాజ్ హఠాన్మరణం

తమిళ చిత్ర పరిశ్రమలో మరో విషాదం చోటుచేసుకుంది. ప్రముఖ నటుడు, దర్శకుడు కె.భాగ్యరాజ్ (73) కన్నుమూశారు. గుండెపోటుతో శనివారం ఉదయం చెన్నైలో తుదిశ్వాస విడిచారు. తమిళ, తెలుగు భాషల్లో 75కు పైగా చిత్రాల్లో ఆయన నటించారు. 25 సినిమాలకు దర్శకత్వం వహించారు. అంతేకాదు.. సంగీత దర్శకుడిగా సింగర్‌గా కూడా ఆయన అలరించారు. చివరిగా ఆయన '35 చిన్న కథ కాదు', శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' చిత్రంలో సాధు పాత్రలో కనిపించారు. తమిళనాడులోని ఈరోడ్ జిల్లా వెల్లాంకోయిల్‌లో ఆయన జన్మించారు. 1981లో నటి ప్రవీణను వివాహం చేసుకున్నారు. కామెర్ల వ్యాధితో ఆమె 1983లో మరణించారు. ఆ తర్వాత 1984లో పూర్ణిమ జయరామ్‌ను పెళ్లాడారు. వీరిద్దరికీ ఇద్దరు సంతానం. కొడుకు శంతను భాగ్యరాజ్ హీరోగా చేస్తున్నారు. కూతురు శరణ్య 'పారిజాతం' వంటి కొన్ని సినిమాల్లో హీరోయిన్‌గా నటించారు. ప్రముఖ దర్శకుడు భారతీరాజా వద్ద '16 వయదినిలే' (తెలుగులో పదహారేళ్ల వయసు) చిత్రానికి సహాయ దర్శకుడిగా కెరీర్ ప్రారంభించారు భాగ్యరాజ్. ఆ సినిమాలో ఒక చిన్న పాత్రలోనూ మెరిశారు. 1979లో 'సువరిల్లాద చిత్రంగళ' సినిమాతో దర్శకుడిగా మారారు. ఆ తర్వాత హీరోగా, దర్శకుడిగా ఆయన చేసిన ప్రయోగాలన్నీ సక్సెస్ అయ్యాయి. 'అన్థా 7 నాట్కళ' (రాధా కళ్యాణం), 'ముంధానై ముడిచ్చు' (మూడు ముళ్లు), 'దూరల్ నిన్ను పోచ్చు' వంటి చిత్రాలు బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. తమిళంలో ఆయన రూపొందించిన ఎన్నో కథలు తెలుగు, హిందీ భాషల్లోకి రీమేక్ అయ్యాయి. అమితాబ్ బచ్చన్ నటించిన 'ఆఖరి రాస్తా' చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే భాగ్యరాజ్ అందించడం విశేషం. భాగ్యరాజ్ కేవలం సినీ రంగానికే పరిమితం కాలేదు. ఆయన 'భాగ్యవారపత్రిక'కు సంపాదకుడిగా వ్యవహరించడమే కాకుండా పలు నవలలు కూడా రచించారు. కథా రచయితగా, దర్శకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞను ప్రదర్శించి దక్షిణ భారత సినీ పరిశ్రమలో ప్రత్యేక స్థానం సంపాదించారు. భాగ్యరాజను ఇండియన్ సినిమాలో 'కింగ్ ఆఫ్ స్క్రీన్ ప్లే' అని పిలుస్తుంటారు. భాగ్యరాజ్ మరణంతో తమిళ సినీ పరిశ్రమలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతిపట్ల సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు.

## భాగ్యారాజ్ మృతికి పలువురు ప్రముఖుల సంతాపం

### నమ్మలేకపోతున్నామన్న చిరు, వెంకటేశ్, రాధిక, సుహాసిని

ప్రముఖ దర్శకుడు, నటుడు కె.భాగ్యరాజ్ మృతి పట్ల నటులు చిరంజీవి, వెంకటేశ్, రాధిక, సుహాసిని వంటి స్టార్లు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన చివరి వీడియో నెట్టింట వైరల్ అవుతుంది. గురువారం ఆయన నటి కుష్బూ కూతురు పెళ్లికి హాజరయ్యారు. అక్కడి చిరంజీవి, వెంకటేశ్, నాగార్జునల తో సరదాగా సంభాషించారు. వారితో కలిసి వేదికపైకి వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. అలాగే పలువురు సినీతారలు కూడా భాగ్యరాజ్‌కు నివాళులు అర్పిస్తూ వీడియోలు పోస్ట్ చేశారు. 'నేను 50 ఏళ్ల క్రితం పరిచయం చేసిన కె.భాగ్యరాజ్ ఈరోజు లేదనే వార్త తీవ్ర వేదనకు గురిచేసింది. తమిళ చిత్ర పరిశ్రమ ఒకే నెలలో ఇద్దరు రాజుల్ని కోల్పోయింది' అని విశ్వనాయకుడు కమల్‌హాసన్ ట్వీట్‌లో పేర్కొన్నారు. 'భాగ్యరాజ్ నాకు మంచి స్నేహితుడు. తెలుగు సినిమా ఇండస్ట్రీకి రావడానికి ముందు తమిళంలో చేసిన చివరి చిత్రం 'డార్లింగ్ డార్లింగ్ డార్లింగ' ఆయన దర్శకత్వంలోనే! కష్టపడి ఎదిగిన దర్శకుడాయన. ఇప్పుడు ఆయన మన మధ్య లేరనే విషయాన్ని నమ్మలేకపోతున్నా' అని సుమన్ పేర్కొన్నారు. 'దర్శకుడు భాగ్యరాజ్ ఇకలేరని విషయం నమ్మలేకపోతున్నా. గొప్ప దర్శకుడు, అసాధారణ నటుడు. సామాజిక సందేశాలున్న ఎన్నో సినిమాలు ఆయన దర్శకత్వంలో వచ్చాయి. తమిళ చిత్రసీమ గొప్ప మేధావుల్లో ఒకరిని కోల్పోయిందని నటి సిమ్రాన్ సంతాపం తెలిపారు.

## భాగ్యరాజ్ భౌతిక కాయానికి సీఎం విజయ్ నివాళి

ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలకు ఆదేశం

తమిళ సినీ పరిశ్రమలో ప్రముఖ దర్శకుడు, నటుడు, స్క్రీన్‌ప్లే రచయిత కే భాగ్యరాజ్ శనివారం చెన్నైలో గుండెపోటుతో కన్నుమూసారు. భాగ్యరాజ్ మృతి పట్ల తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, సూపర్ స్టార్ రజనీకాంత్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ భార్య పూర్ణిమ, కుమారుడు శంతనుతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. తమిళ చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన విశేష సేవలకు గుర్తింపుగా భాగ్యరాజ్ అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. భాగ్యరాజ్ మరణవార్త తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి ఆయనకు కన్నీటి వీడ్కోలు పలుకుతున్నారు.



# మైత్రీ మూవీ మేకర్స్‌లో నవీన్ పోలిశెట్టి

టాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నవీన్ పోలిశెట్టి తన తదుపరి క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాడు. 'అనగనగా ఒక రాజు' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకోవడమే కాకుండా, వంద కోట్ల క్లబ్‌లో చేరి తన మార్కెట్ స్టామినాను నిరూపించుకున్న నవీన్.. తన కొత్త సినిమాను లైన్‌లో పెట్టాడు. అగ్ర నిర్మాణ సంస్థ అయిన మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతుంది. నవీన్ పోలిశెట్టి మార్కెట్ పరిధిని దృష్టిలో ఉంచుకుని ఈ కలయికపై మైత్రీ సంస్థ చాలా నమ్మకంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన రాకముందే నవీన్ పోలిశెట్టి సోషల్ మీడియా వేదికగా చేసిన ఒక వినూత్న ప్రమోషన్ ప్రస్తుతం నెట్టింట సంచలనంగా మారింది. సినీ ఇండస్ట్రీలోని నలుగురు టాప్ కమర్షియల్ డైరెక్టర్స్ ప్రశాంత్ నీల్, సుకుమార్, లోకేష్ కనగరాజ్, మరియు రిషబ్ శెట్టిలతో కలిసి దిగిన ఒక అదిరిపోయే ఫన్నీ రీల్‌ను ఆయన షేర్ చేశాడు. ఈ దర్శకుల సినిమాల బాక్సాఫీస్ వసూళ్లను ఉద్దేశిస్తూ.. దీనిని తన కెరీర్‌లోనే అత్యంత ఖరీదైన 'రూ. 5000 కోట్ల ఫ్రేమ' అని నవీన్ చమత్కరించాడు. ఈ వైరల్ వీడియో ద్వారా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో తన తదుపరి చిత్రం రాబోతోందని నవీన్ క్లారిటీ ఇచ్చాడు. దీనికి స్పందనగా మైత్రీ మూవీ మేకర్స్ కూడా నవీన్‌ను తమ ప్రొడక్షన్ ఫ్యామిలీలోకి ఆహ్వానిస్తూ.. ఒక ఫుల్ 'ఆన్ ఎంటర్‌టైనర్ లోడింగ్ అవుతోందని 'వెల్లడించింది. అయితే ఈ సరికొత్త ప్రాజెక్ట్‌ను పూర్తి స్థాయి క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కించ నున్నారు. 'సైరన' సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న తమిళ దర్శకుడు ఆంటోనీ భాగ్యరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నట్లు సినీ వర్గాల్లో గట్టి ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం స్క్రిప్టింగ్, ప్రీ 'ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసిన చిత్ర బృందం, త్వరలోనే షూటింగ్‌ను ప్రారంభించి, వచ్చే ఏడాది ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి ప్లాన్ చేస్తోంది. నవీన్ పోలిశెట్టి అద్భుతమైన కామిక్ టైమింగ్, ఆంటోనీ భాగ్యరాజ్ టేకింగ్, మరియు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణ విలువల కలయికలో రాబోతున్న ఈ చిత్రంపై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి.



This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com.
Corporate Office: HIG 79, VNR RESIDANCY ,VENKATARAMANA COLONY, KUKATPALLY ,HYDERABAD, 500085